నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 27-9-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:47 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

శుద్ధ జలాలు
నేడు మురికి కూపాలు
మనచేతలు.

ధర్మదండన
వేరుకు చీడభయం
త్రాసా మజాకా!.

శవాల దిబ్బ
లిబియాలో వరదబ్బ
ప్రకృతి దెబ్బ

ముక్కడిముక్కు
అందమైన సంపెంగ
ప్లాస్టిక్ సర్జరీ.

సోమరి ప్రాణం
పగలురాత్రి రొటీన్
పరాన్న జీవి

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాయి

రాజకీయ కోణంలో
రాద్ధాంతపు నెత్తి !
తమిళపై విసిరిందోయి
బడుగులపై కత్తి !.

అర్హతలు లేని వాళ్ళని
ఆ ఇద్దరు వద్దు !
నేను గవర్నర్నయ్యాను
నాకు నేను ముద్దు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



కూసుమంచిలో దయాకర్ రెడ్డి పర్యటన

– వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు
– విరాళాలు అందజేత

ఖమ్మం, సెప్టెంబర్ 26: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో ఛైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ ఛార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి కూసుమంచి మండలంలో మంగళవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మండల ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని వినాయకున్ని వేడుకున్నారు. మండపానికి రూ. 5వేల చొప్పున ప్రతీ మండపానికి విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు దయాకర్ రెడ్డిని ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఖమ్మం రూరల్ మండలంలో పార్టీ రాష్ట్ర నాయకురాలు మద్దినేని బేబీ స్వర్ణకుమారి పర్యటించారు. వినాయక మండపాలను సందర్శించి విరాళాలను అందజేశారు.

నేరాల నియంత్రణకై విసిబుల్ పోలీసింగ్ అమలు చేయాలి

–జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 26:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 26: నేరాల నియంత్రణకై విసిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం రోజున వేములవాడ డిఎస్పీ కార్యాలయం, వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లను ఎస్పీ అఖిల్ మహాజన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డ్స్ ను, సిడి ఫైల్స్ తనిఖీ చేసి సబ్ డివిజనల్ పరిధిలో నమోదు అయిన కేసుల వివరాలు, ఎస్సీ, ఎస్టీ, ఫోక్సో కేసుల, గ్రేవ్ కేసులలో,అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసుల వివరాల అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు. సబ్ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి పోలీస్ స్టేషన్ లలోఎక్కువగా నమోదవుతున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం వార్షిక తనిఖీల్లో భాగంగా వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు, రికార్డ్స్ , సీడీ ఫైల్స్ ను ఫంక్షన్ హాల్ వర్టికల్స్ అమలు తీరు,స్టేషన్ లో అమలవుతున్న 5బి తీరును పరిశీలించి నమోదు అయిన కేసులల్లో ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ ఉండాలని కేసుల్లో శిక్షల శాతం పెంచాలని అధికారులకు సూచించారు.

అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది విధులల్లో అలసత్వం పహించకూడదని, పోలీసులు అంకితభావంతో విధులను నిర్వర్తించాలన్నారు. విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని గ్రామాల్లో తరచు పర్యటిస్తూ ప్రజలతో సస్పబంధాలు కలిగి ఉండాలని అన్నారు. నేరాల నియంత్రణకై పోలీస్ స్టేషన్ లో పెట్రోలింగ్,విజిబుల్ పోలీసింగ్ లు నిర్వహించాలన్నారు.

వివిధ ప్రాంతాల నుండి రాజన్న దర్శనికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అన్నారు.రానున్న ఎన్నికలు దృష్ట్యా సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండు ఎన్నికలకు సన్నద్ధం కావాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులు, సస్పెక్ట్ లు, రౌడీ షీటర్లపై నిఘాను ఉంచాలన్నారు.

వేములవాడ సబ్ డివిసిన్ పరిధిలో సుమారు 823 గణేష్ విగ్రహాలు ఉన్నాయని వేములవాడ పట్టణ పరిధిలో 180 వరకు గణేష్ విగ్రహాల ఉన్నాయని, బుధవారం రోజున జరిగే

గణేష్ శోభయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సిబ్బందికి కేటాయించిన గణేష్ మండపాలను సందర్శించి గణేష్ మండపాల నిర్వహకులతో మాట్లాడి బుధవారం రోజున మధ్యాన్నం 2 గంటల వరకు గణేష్ శోభయాత్ర మొదలై రాత్రి 12 గంటల లోపు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని,గణేష్ శోభయాత్రలో డి జె లకు అనుమతి లేదని,నిబంధనలకు విరుద్ధంగా డిజె లు వినియోగించే వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. శాంతి భద్రతల పర్యవేక్షణ లో వేములవాడ టౌన్ పోలీస్ లు అమోఘం గా పని చేస్తున్నారని కొనియాడారు. ఎస్పీ వెంట వేములవాడ డీఎస్పీ నాగేంద్రచరి, పట్టణ సిఐ కరుణాకర్, సిఐలు కృష్ణకుమార్, కిరణ్, ఎస్ఐలు రమేష్, ప్రశాంత్, దిలీప్ సిబ్బంది ఉన్నారు.

గవర్నర్ వైఖరిపై మంత్రి కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 26: గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ వైఖరిపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె కూడా రాజకీయ నాయకురాలు. తమిళనాడు బీజేపీ ప్రెసిడెంట్గా పని చేశారని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ భవన్లో మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ ప్రజా ఉద్యమాల్లో పని చేసిన వారిని మా కేబినెట్ నామినేట్ చేసిందని కేటీఆర్ తెలిపారు. దాసోజు శ్రవణ్ ప్రొఫెసర్. తెలంగాణ ఉద్యమంతో సహా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. నాకైతే గ్యారంటీ ఉండే. మేడమ్కు మా మీద ఉన్నంత కోపం.. ఆయన మీద ఉండదు ఎందుకంటే ఆయన మంచి ప్రొఫెసర్ అని. మంచివాడు ఆమోదిస్తారని అనుకున్నాం. ఇక సత్యనారాయణ అయితే ఒక ఎరుకల కమ్యూనిటీ నాయకుడు. ట్రేడ్ యూనియన్ నాయకుడిగా జాతీయ స్థాయిలో పని చేశారు. ట్రేడ్ యూనియన్లో చేసిన సేవలకు జనరల్ నియోజకవర్గంలో ఆయనను ప్రజలు గెలిపించారు. ఈ ఇద్దరి నేపథ్యాన్ని మనసుతో ఆలోచించి ఉంటే నిర్ణయం ఇలా రాకపోయేది. మోదీతో పాటు ఆయన ఏజెంట్లు(గవర్నర్లు) అప్రజాస్వామికంగా ఉన్నారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కేవిధంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయాల్లో ఉన్నవారిని ఇలాంటి పదవుల్లోకి తీసుకురావొద్దని లేఖ రాశారు. అంతకంటే హాస్యాస్పదమైన మాట ఇంకోటి లేనేలేదు. ఆమె కూడా రాజకీయ నాయకురాలు. తమిళనాడు బీజేపీ ప్రెసిడెంట్గా పని చేశారు. గవర్నర్ అయ్యే ఒక రోజు ముందు వరకు కూడా ఆమె బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్. క్రియాశీలక రాజకీయాల్లో ఉన్న వారు గవర్నర్లుగా రాకూడదని సర్కారియా కమిషన్ స్పష్టంగా చెప్పింది అని కేటీఆర్ గుర్తు చేశారు.

ఎవరు అన్ఫిట్.. మీరా..? మోదీనా..?

అన్ఫిట్ అని ఆమె వాడారు.. ఎవరు అన్ఫిట్. మీరా. మోదీనా అని కేటీఆర్ ప్రశ్నించారు. సర్కారియా కమిషన్ను తుంగలో తొక్కిన మోదీనా..? తప్పకుండా ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటాం. బలహీన వర్గాలకు చెందిన బలమైన గొంతుకలను శాసనమండలికి తీసుకువస్తామంటే మీకేం బాధ..? మంచివారా కాదా విచారించండి. అవును రాజకీయ పార్టీతో సంబంధం ఉంది. గవర్నర్ బీజేపీ నాయకురాలిగా పని చేయడం లేదా..? ఇది తప్పా..? తీవ్రంగా ఖండిస్తున్నాం గవర్నర్ వైఖరిని. తమిళనాడు గవర్నర్ తమిళనాడు పేరును మార్చేస్తారు. ఇంకో గవర్నరేమో సీఎంకు సంబంధం లేకుండా నిర్ణయాలను తీసుకుంటారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వా లకు ప్రాధాన్యత లేకపోతే ఎలా..? మోదీ ఏజెంట్లది పెత్తనం అయితే ఇదెక్కడి వ్యవస్థ..? అని కేటీఆర్ ప్రశ్నించారు.

ఈ దేశంలో గవర్నర్ పోస్టు అవసరమా? అని కేటీఆర్ ప్రశ్నించారు. గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని, ప్రజల చేతు ఎన్నుకోబడ్డ ప్రభుత్వాలను అప్రతిష్టపాలు చేయడం సరికాదు. జాతీయ పార్టీలుగా చెప్పుకునే కాంగ్రెస్, బీజేపీకి ఒక నీతి. పరస్పరం సహకరించుకుంటాయి. కర్ణాటకలో కాంగ్రెస్ నాయకులను ఎమ్మెల్సీలుగా చేయడంలో అక్కడి బీజేపీ గవర్నర్ సహకరిస్తారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా అర్హత లేని వారిని నామినేట్ చేస్తారు. తెలంగాణ విషయానికి వచ్చే సరికి ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న శ్రవణ్, సత్యనారాయణ అనర్హులు అయ్యారని.. ఈ విషయాన్ని ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

గవర్నర్ నిర్ణయంతో బీసీలకు తీవ్ర అన్యాయం..
అమె వైఖరి ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, సెప్టెంబర్ 26:గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవుల్లో నామినేట్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పేర్లను తిరస్కరిస్తూ గవర్నర్ తీసుకున్న నిర్ణయంతో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తమది బీసీ వ్యతిరేక పార్టీ అని భారతీయ జనతా పార్టీ మరోసారి నిరూపించుకుందని తేల్చి చెప్పారు.

మంగళవారం శాసనమండలిలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవులకు నామినేట్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా పంపించిన పేర్లను గవర్నర్ తిరస్కరించడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు. దేశంలో భారత రాజ్యాంగం నడుస్తుందా లేదా భారతీయ జనతా పార్టీ రాజ్యాంగం నడుస్తుందా అన్న అనుమానం కలిగే విధంగా పలు రాష్ట్రాల్లో గవర్నర్లు ప్రవర్తిస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రతీ రాజ్యాంగబద్ధమైన సంస్థకు ఉండే హక్కులు, పరిధులు వాటికి ఉంటాయనీ, అన్నింటినీ గమనిస్తూ ప్రజలను ఒక్కతాటిపై ముందుకు నడిపించాలన్న దాన్ని పక్కన పెట్టి గవర్నర్లు ఇలా వ్యవహరించడం దురదృష్టకరమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పేర్లను గవర్నర్ ఆమోదించే సంప్రదాయం ఉందని, దాన్ని విస్మరించి బీసీ వర్గాలకు నష్టం చేయడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఇద్దరు వ్యక్తులు బలహీన వర్గాలకు చెందిన వారిని, ప్రత్యక్ష ఎన్నికల్లో అవకాశాలు రాని వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్న సదుద్దేశంతో సీఎం కేసీఆర్ సిఫారసు చేసిన రెండు పేర్లను గవర్నర్ తిరస్కరించడంతో భారతీయ జనతా పార్టీ మరోసారి బీసీ వ్యతిరేక పార్టీ అని నిరూపించుకుందని స్పష్టం చేశారు. బీజేపీ వ్యవహార శైలిని గమనించాలని ప్రజలకు కవిత విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగపరమైన సంప్రదాయాలను పాటించుకుంటూ వెళ్తే అన్ని వ్యవస్థలు కలిసి పనిచేసే ఆస్కారం కలుగుతుందని, తద్వారా ప్రజలకు స్థిరత్వాన్ని అందించగలుగుతామని అన్నారు. నిరంతరం నెగిటివ్ చర్చను రేకెత్తించడం తప్ప దీనివల్ల ఒరిగేదేమీ లేదని చెప్పారు. బీసీ వర్గాలకు బీజేపీ ఏ రకంగా అన్యాయం చేస్తుందో మరోసారి గవర్నర్ నిరూపించారని విమర్శించారు. బీసీ వర్గాలను పైకి తీసుకురావడానికి తమ పార్టీ చర్యలు తీసుకుంటుంటే, బీజేపీ పార్టీ అందుకు విరుద్ధంగా పనిచేస్తుందని ఆక్షేపించారు.

చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో కవితతో పాటు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎంపీ వెంకటేష్ నేత , బీసీ కమిషన్ మెంబర్ కిషోర్ గౌడ్ పాల్గొన్నారు.

బాల సాహిత్యంలో తెలంగాణ దేశానికే నమూన

– రాష్ట్ర పాఠశాల విద్యాశాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్ సెప్టెంబర్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణాలో పాఠశాల విద్యార్థులు చిన్నారి చేతులతో రాసిన కథలు నూతన చరిత్రకు శ్రీకారం చుట్టినట్టు అయ్యిందని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఒకే రోజు ఒకే సమయానికి ఐదు లక్షల మంది విద్యార్థులు "మన ఊరు ' మన చెట్టు" అన్న అంశంపై కథలు రాయడం దేశ చరిత్రలోనే మొట్ట మొదటిది కావడం తెలంగాణ గర్వించదగ్గ విషయమని ఆమె అన్నారు. 33 జిల్లాలకు చెందిన విద్యార్థులు రాసిన కథలను ముప్పై మూడు పుస్తకాలుగా తెలంగాణ సాహిత్య అకాడమీ ముద్రించి, విద్యార్థి లోకానికి అందించడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దార్శనిక ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ విద్యార్థులు కలం పట్టి తమ ఊరి ప్రకృతిని అద్భుతంగా కథలుగా మలచి దేశానికే మోడల్గా నిలిచారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం అనేక రంగాలలో దేశానికే మోడల్గా నిలిచినట్లు తెలంగాణ పాఠశాల విద్యార్థులు కూడా దేశానికి మోడల్గా నిలిచారని పేర్కొన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో చేపట్టిన "మన ఊరు ' మన చెట్టు" అన్న కథల రచనకు పాఠశాల విద్యాశాఖ చేసిన కృషి తోడయ్యి బాలల కథా ప్రపంచలోనే ఒక నూతన ఒరవడి సృష్టించడం జరిగిందని చెప్పారు. తెలంగాణ అంబేద్కర్ సచివాలయంలో పాఠశాల విద్యాశాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మంగళ వారం తన కార్యాలయంలో "మన ఊరు ' మన చెట్టు" అనే అంశంపై తెలంగాణ సాహిత్య అకాడమీ వెలవరించిన ముప్పై మూడు పుస్తకాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో నూతన సృజనలను రగిలించేందుకై తెలంగాణ సాహిత్య అకాడమి చేసిన కృషిని అభినందించారు. విద్యార్థులలో దాగి ఉన్న కొత్త ఆలోచనలకు పురుడుపోసేందుకు, వారిలో ఉన్న సాహిత్య పటిమను వెలుగు చూపేందుకు ఈ కథా రచన ప్రయోగం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ వేదికల ద్వారా, వివిధ సంస్థల ద్వారా బాల సాహిత్యం వెల్లివిరుస్తూ వస్తుందని, తెలంగాణ సాహిత్య అకాడమీ ఒక్కసారిగా ఐదు లక్షల మంది విద్యార్థులను ఒక్కదగ్గరికి తీసుకవచ్చి బాల సాహిత్యానికి పెద్ద పీఠం వేయడం సాహిత్య చరిత్రలోనే మకుటాయమానంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇంత పెద్ద సాహిత్య మహా యజ్ఞాన్ని ప్రోత్సహిస్తూ కృషి చేసిన ఉపాధ్యాయ లోకాన్ని, అందులో పాల్గొన్న విద్యార్థులందరికి ఆమె హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. బాల సాహిత్యంలో నూతన ఒరవడి తెచ్చి లక్షలాది మంది పిల్లల్ని కథా రచన చేసేందుకు దోహదకారిగా నిలిచిన తెలంగాణ సాహిత్య అకాడమీ కృషి చరిత్రలో నిలిచిపోతుందని అభినందించారు. బాల సాహిత్య విస్తృతికి కృషి చేయడమే కాకుండా, తెలంగాణ రాష్ట్రంలో పుస్తక ప్రదర్శనలతో జ్ఞాన తెలంగాణ కోసం కృషి చేస్తున్న సాహిత్య అకాడమీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ను ఈ సందర్భంగా విద్యా శాఖ మంత్రి శాలువాతో సన్మానించారు. తెలంగాణ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ కోసం జరుగుతున్న కృషిని గమనించిన విద్యార్థులు తమ కథల్లో తమ ఊర్లోని పచ్చదనాన్ని కథలుగా మలిచారని తెలిపారు. ఈ బాల కథల రచనల్లో పాల్గొన్న విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప కవులుగా, రచయితలుగా, సామాజిక స్పృహ గల్ల యోధులుగా పర్యావరణ పరిరక్షకులుగా తమ గ్రామాలల్లో పచ్చదనాన్ని ప్రతిష్టించే పర్యావరణ కార్యకర్తలుగా తయారు కావడానికి ఈ కథా రచన ప్రయోగం ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు.ఈ తరం విద్యార్థులు ఎంతో చురుకైన వారని వారిని గొప్ప సమాజ పరిరక్షకులుగా మార్చడానికి సాహిత్యం ఎంతో దోహదం చేస్తుందని చెప్పారు. ఈ ముప్పై మూడు కథల పుస్తకాలను రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు అందిస్తామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి బాలాచారి నామోజు, తెలంగాణ విద్యా మౌళిక వసతుల సంస్థ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, ప్రొ. నారా కిషోర్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పిఆర్టియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డి. శ్రీపాల్ రెడ్డి, బి. కమలాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

వీరనారి ఐలమ్మ స్ఫూర్తితోనే సీఎం కేసీఆర్ తెలంగాణ సాధించారు : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, సెప్టెంబర్ 26:నిజాం పాలన, విస్నూరు దేశ్ ముఖ్ ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడిన యోధురాలు చాకలి ఐలమ్మ అని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.ఐలమ్మ జయంతి సందర్భంగా హైదరాబాద్లోని మంత్రుల నివాసంలో గల తన క్యాంప్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఐలమ్మ ఎంతో చురుగ్గా పాల్గొన్నారు.

దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా ఒకవైపు సాయుధ పోరాటం చేస్తూనే, మరోవైపు అమ్మ లాగా ఉద్యమ కారులకు అన్నం పెట్టి ఆదరించిన మహనీయురాలు అని ప్రశంసించారు. ఐలమ్మ స్ఫూర్తితోనే సీఎం కేసీఆర్ తెలంగాణ సాధించారు. పరిపాలనలో కూడా అదే ఉద్యమ స్ఫూర్తిని పాటిస్తున్నారు. అందుకే తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా మారిందన్నారు. ఐలమ్మ జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహిస్తుండటం పట్ల సీఎం కేసీఆర్కు ధన్యవాదాలు తెలిపారు.

టీబీ నివారణలో పరిశ్రమల పాత్ర

సంగారెడ్డి, సెప్టెంబర్ 26 (నేటినిజం ప్రతినిధి): స్థానిక జనప్రియ హోటల్ సంగారెడ్డి నందు మంగళవారం నిర్వహించిన టీబీ నివారణ అవగాహన కార్యక్రమంలో ఇండస్ట్రియల్ యొక్క పాత్రను గురించి విస్తృతంగా చర్చించడం అయింది. ఈ కార్యక్రమంలో టీబీ లక్షణాలను గురించి టీబీ యొక్క ప్రభావం ఇండస్ట్రీలో పనిచేస్తున్న కార్మికులపై ఏవిధంగా చూపుతోందని విషయాన్ని గురించి జిల్లా క్షయ నివారణ అధికారిణి డాక్టర్ జి రాజేశ్వరి ఇండస్ట్రీ ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. అలాగే జిల్లా స్థాయిలో టీబీ నివారణ కొరకు చేపట్టిన వివిధ కార్యక్రమాలను గురించి ఆమె వివరించారు టీబీ నివారణకు ఇండస్ట్రియల్ కృషి అవగాహన కల్పించుటలో అవసరమని తెలియజేశారు.

రాష్ట్ర క్షయ నివారణ ఐయిసీ ఆఫీసర్ జితేంద్ర మాట్లాడుతూ ఇండస్ట్రీలు తమ పరిధిలో కమిటీలు వేసుకొని టీబీ నివారణకు కృషి చేయాలని ఆయన పరిశ్రమల ప్రతినిధులను కోరారు. టీబీ నివారణకు అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. టీబీ రాష్ట్రటెక్నికల్ ఆఫీసర్ వాసు మాట్లాడుతూ ఎన్ టి ఈపి ద్వారా అనేక సేవలు టీబీ నివారణ కొరకు అందించబడుతున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవడానికి పరిశ్రమలు చొరవ తీసుకోవాలన్నారు. టీబీ అలర్ట్ ఇండియా హెడ్ ప్రోగ్రామ్స్ తమ సంస్థ చేపట్టిన కార్యక్రమాల గురించి వివరంగా తెలియజేస్తూ బీటీబీ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో 37 లక్షల మందికి స్క్రీనింగ్ చేసాము అని 4013 పాజిటివ్ కేసెస్ గుర్తించామని, అందరి సహకారంతో ఇది సాధ్యపడిందని రాబోయే రోజులలో పరిశ్రమలు మరిన్ని ప్రణాళికలతో ముందుకు రావాలన్నారు. వివిధ పరిశ్రమల నుండి పాల్గొన్న ప్రతినిధులు రాబోయే రోజులలో తమ పరిశ్రమలలో టీబీ నివారణ కొరకు అనేక చర్యలు తీసుకుంటామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఎఫ్ వరుణ్ బావేరాజెస్, యమ్ ఎస్ ఎన్ ల్యాబ్స్, ఎవరెస్ట్ ఇండస్ట్రీ, గ్లాండ్ ఫార్మా, న్యూల్యాండ్ ల్యాబ్స్, అరబిందో ఫార్మా, ఏఆర్ఎల్ టైర్స్, ఏసీ టైర్స్, పారాగాన్ ఇండస్ట్రీస్, లక్ష్మీకాంత ఇండస్ట్రీ, క్లినివేంట్ మైలాన్, ఎమ్ వై కె లాటిక్రీట్ సంబంధించిన ప్రతినిధులు హాజరుకాగా బ్రేక్ ఇన్ ద బ్యారియర్స్ ప్రాజెక్టు టీం మెంబెర్స్ పి పురుషోత్తం, పి కృష్ణ, కే చంద్రకళ, ఎం గోవింద్, జి అశోక్, ఎన్ టీ ఇ పి సిబ్బంది, నర్సిరెడ్డి మరియు ఏసీఎస్ఎం కోఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

కృష్ణవేణీ టాలెంట్ స్కూల్ లో గణనాథుడికి ప్రత్యేక పూజలు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 26:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని కృష్ణవేణీ టాలెంట్ పాఠశాలలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతిష్టించిన గణనాథుడికి మంగళవారం రుత్వికులచే అత్యంత వైభవోపేతంగా వేదమంత్రోత్సరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతశాల విద్యార్థుల గోత్ర నామాలతో అర్చన చేశారు.

వివిధ రకాల పండ్లు, పూలతో స్వామి వారిని కొలిచారు. వినాయకునికి ప్రీతికరమైన మోదకాలు, ఉండ్రాళ్ళు, దద్దోజనం, పాయసం వంటి ప్రసాదాలను నివేదన అర్పించారు. విద్యార్థులు చేసిన భజనలు చాలా ఆకర్షణీయంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శరవేగంగా సాగుతున్న అయోధ్య రామ మందిర నిర్మాణ పనులు

–డిసెంబర్ చివరికల్లా పనులు పూర్తి.. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం ట్రస్ట్

లక్నో సెప్టెంబర్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అయోధ్య లో చేపట్టిన రామ మందిర నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆలయం నిర్మాణానికి సంబంధించిన చాలా పనులు ఇప్పటికే పూర్తైనట్లు తెలుస్తోంది. ఆలయ నిర్మాణానికి సంబంధించిన కొన్ని ఫొటోలను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం తాజాగా విడుదల చేసింది.

ఆలయ నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు ముందుకు సాగుతున్నట్లు తెలిపింది.గ్రౌండ్ ఫ్లోర్ పనులు నవంబర్కల్లా పూర్తి అవుతాయని పేర్కొంది. మొదటి అంతస్తులో 50 శాతం పనులు పూర్తైనట్లు తెలిపింది. డిసెంబర్ చివరి నాటికి మొదటి అంతస్తు పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ట్రస్ట్ వెల్లడించింది.

వచ్చే ఏడాది జనవరిలో ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురానుంది. 2024 జనవరి 21-23 తేదీల్లో ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.జనవరి 21 నుంచి 23వ తేదీల మధ్య నిర్వహించే రాముడి విగ్రహప్రతిష్ఠాపనకు దేశ నలమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నట్లు ట్రస్టు భావిస్తోంది. ఈ మేరకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసింది. ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే ఏర్పాట్లు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ఇక ఈ కార్యక్రమానికి ఆహ్వానించే అతిథుల జాబితాపై ట్రస్టు దృష్టి సారించింది. ప్రధాని నరేంద్ర మోదీ సహా మొత్తం 25వేల మందిని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానించనున్నట్లు.. ట్రస్టు ఇదివరకే ప్రకటించింది.అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి 2020 ఆగస్టు 5న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. గర్భగుడి ప్రాంతంలో 40 కిలోల వెండి ఇటుకలను స్థాపించారు. మూడు అంతస్తుల్లో, ఐదు మండపాలుగా చేపడుతున్న రామాలయ నిర్మాణానికి సుమార

నేటినిజం
సాహితీ కిరణాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: భైస దేవదాస్: సెల్:9000065433 బుధవారం 27-9-2023

నాగన్న పదాలు

ఆరుద్ర మేధావి
ఆత్రేయ మనసుకవి
వేటూరి సమజపవి
ఓరి! నాగన్న.

మహానటి సావిత్రి
చక్కని అభినేత్రి
చిత్రసీమ సుపుత్రి
ఓరి! నాగన్న.

కోకిలమ్మ పదాలు
"దీపక్" తొలి చెణుకులు
మందారపు బాటలు
ఓరి! నాగన్న.

విప్లవ పదగమనం
మానవతే పరిమలం
"దీపం" చనె గగనంః
ఓరి! నాగన్న.

-నెమలికొండ నాగేశ్వర్ రావు
8688553470

ఘంటారవం

పొలిమిక పేజీలు
పొలాలకే అనుకోకు
పొరుగు దేశాలతోనూ
ఉంటాయని మరువకు.

విజయం.
ఊరేగిస్తుంది
ఓటమి
ఉరిమిచూస్తుంది.

చివరిదాకా
ఎదురుచూపులు
చరమాంకంలో
బెరుదుచూపులు.

విజయానుభవంకన్నా
పోరాట పటిమే ప్రధానం
శిఖరాగ్ర స్పర్శకన్నా
అధిరోహణ ప్రతిభే ఘనం.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

పబ్లిసిటీని మించిన సింప్లిసిటీ

ఆకాశంలో వెలిగే
ధృవ నక్షత్రాన్ని నేనయితే
ఆ వెలుగు వెనకనున్న
తెర ఆకాశం మా మాష్టారు
నింగిలోకి దూసుకు వెళ్లే
రాకెట్టును నేనయితే
ఆ రాకెట్టులనిండా దట్టించిన
ఇంధనం మా మాష్టారు
బ్రహ్మాస్త్రాన్ని సంధించే
మహావీరున్ని నేనయితే
సంధించటానికి ఉపకరించే
మంత్ర మా మాష్టారు.

ఎర్రగాపండిన పరిమళాల
తాంబూళాన్ని నేనయితే,
అందులోని ఆకు, వక్కా
సమస్తం మా మాష్టరు
ఆరు అంతస్తుల
అందమైన భవంతిని నేనైతే
ఆరంభంలో పునాదిరాళ్లను పేర్చిన
మేస్త్రీ రూపం మా మాష్టరు
బోసీ నవ్వుల పసిపాపను నేనైతే
ఈ పాపను లాలించే
తల్లివొడి మా మాష్టరు.

అపాంట్మెంటే కాని
రిటైర్మెంటులేని కమిట్మెంట్ ఆయనిది
విద్యార్థుల విస్తర్లనిండా నిత్యం
పాఠాలను వడ్డించే జ్ఞానబ్రహ్మ
ఆయన
పబ్లిసిటీని మించిన సింప్లిసిటీ
ఆయనిది, ఎలక్ట్రిసిటీని మించిన
కెపాసిటీ ఆయనిది
బ్రహ్మోత్సవాలలో
దేవుడు పూరేగే పల్లకీ కంటే,
క్లాసులో మా మాష్టారు కూర్చున్న
కర్ర కుర్చీకే నేనూ దండం పెడతాను
ఒక్కసారి మా మాష్టారు
మా వైపు చూస్తే చాలు
ఆ కనురెప్పల క్రింద
మా జీవితాలు ఎంతో భద్రం
తరగతి గదుల్లోబ్లాకు బోర్డుమీద
సుద్దముక్కతో ఆయన ఎగురవేసే
తెల్లటి పావురాలను కోసం
మళ్లీ మళ్లీ నేను
ఆయన విద్యార్థినై పుడతాను
రోజూ ఉదయం క్రమం తప్పకుండా
సూర్యుడికి నా నమస్కారం
ఆ సూర్యుడు సాక్షాత్తు మా మాష్టరే

-డాక్టర్ కె.జి. వేణు,
98480 70084

గాంధే శాంతి సందేశం

అహింస ఆయుధం చేసి
సత్యమార్గమును చూపి
ధర్మ తేజో దీప్తివయ్యావు
నడిచావు, నువ్వు నడిపించావు
శాంతి మంత్రం పఠించావు
నమ్మకమెంతో పెంచావు.

ఉద్యమాన్ని ఉరికించావు
శత్రువును ఎదురించావు
అహింసా మూర్తి గాంధీ
ఈ జగానికి మార్గం చూపావు.

అజ్ఞానం తొలగించావు
ఏకత అందరిలో పెంచావు
సమ భావం నేర్పించావు
దశా దిశలను చూపావు
శాంతి మూర్తిగా ఎదిగావు
ఆలోచన నీది ఆచరణీయం
ప్రపంచానికి గాంధీ శాంతి సందేశం.

రాక్షస పాలన అంతమొందించగా
ఆంగ్లేయులను తరిమి వేయగా
రణ తంత్రాన్ని రచించావు
సత్యాగ్రహమును చేపట్టావు
అహింసలో బలమును తెలిపి
శాంతి లోని విలువను తెలిపి
బలవంతులనూ ఓడించావు
మహాత్ముడిగా ఎదిగా

ఓ మహాత్మా
నీ శాంతి మంత్రమే కావాలిపుడు
నీ సమభావమే వర్ధిల్లాలిపుడు
నీ నామస్మరణే మోగాలిపుడు
నీ ధర్మ మార్గమే మెరవాలిపుడు
గాంధీయవాదమే గెలవాలిపుడు
నీ సిద్ధాంతాలే నిలవాలిపుడు
ప్రతి గుండెలో మోగాలి
ప్రతి శ్వాసలో జీవం పోసుకోవాలి
ప్రతిచోట పరిమళమై వ్యాపించాలి
ప్రతి నోట ప్రతి ఇంట నీ శాంతి
మంత్రమే
పఠించబడాలిపుడు
ఈ జగాని కి నువ్వే ఆదర్శం ఇపుడు
రక్షగ నీ సిద్ధాంతమే నిలవాలిప్పుడు

- సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

ఆభరణాలు !

మనమేఅక్షరం రాసినా కాగితం
తన గుండెలో దాచుకుంటున్నట్లే ,
ఆంతర్యంలో మంచిజ్ఞాపకమేదైనా
అలవోకగా దాగి నిక్షిప్తమౌతాయి !
కానీ , కొన్నినచ్చిన రాతలుమాత్రమే
ఆ కాగితాన్ని దాచుకునేలా చేస్తాయి !
అలా ? కొన్ని జ్ఞాపకాలు మాత్రమే
జీవితాంతం విలువైన ఆభరణాలై ,
మంచుముత్యాలై , మణిమాణిక్యాలై
ప్రతినిత్యం పదిలంగా గుర్తుకొచ్చేలా
చిరునవ్వుల పరిమళ సువాసనలతో
నూరేళ్ళు మనసులో నిలిచిపోతాయి !
అలాగే ,
ఈ సుదీర్ఘమైన జీవిత పయనంలో
అనుకోకుండా జ్ఞాపకాలైన బంధాలు ,
వారితో అనుబంధాలుకూడా అంతే !
కొన్ని తామరాకుపై నీటిబొట్టులా పడి
ఆస్తిత్వం నిలుపుకోలేక జారిపోతాయి
అపశృతులుగా మారి ఆవిరైపోతాయి !
మరికొన్ని అంతరంగపు పొరలమధ్య
ఆణిముత్యాలై ఆనందాన్ని నింపుతూ
జీవితంలో వెన్నెలగా వెంటనిలుస్తాయి
జ్ఞాపకాలకు వజ్రాల మెరుపునిస్తాయి
చిరునామాకు చిరునవ్వును జోడిస్తాయి
అవే మనసుకు నిజమైన ఆభరణాలు !

- రాజేశ్
9440460490

కాల గహ్వరం

నీ చిన్నప్పుడు
నువ్వు మాట్లాడలేకపోయినా
నీభాష నాకర్థమయింది
ఇప్పుడు
నేను పెద్దదాన్నయ్యాక
ఇంకా మాట్లాడగలుగుతున్నా
నా మాటలు నీకర్థంకావటంలేదు
ఇక్కడ పని చేస్తున్నది
చెవులా ..మనసా....
అన్నింటినీ మింగేస్తున్న
కాలగహ్వరమా...?

-డా.సి.భవానీదేవి
9866847000

సునందామృతం

క్షీరము అంటే పాలు. నీరము అంటే నీళ్ళు.

పాలూ నీళ్ళలా కలిసి మెలిసి ఉండే వాళ్ళను, ఒకరికొకరు స్నేహంగా ఉంటూ త్యాగం చేయడానికి వెనుకాడని బంధాన్ని ఉద్దేశించినదే ఈ న్యాయము.

పాలలో నీళ్ళు కలిపినా పాలరంగు మారదు. పాలలాగే ఉంటాయి. ఆరోగ్యానికి మరీ చిక్కటి పాలు కాకుండా అందులో నీళ్ళు కలిపి తాగితేనే మంచిది అంటుంటారు. ×

మరి పాలూ నీళ్ళ స్నేహం. అవి ఒకదాని కోసం ఒకటి చేసుకునే త్యాగం, నిజమైన స్నేహం గురించి భర్తృహరి సుభాషితాల్లో ఎంత చక్కగా రాశారు. దానిని తెనిగించి రాసిన ఏనుగు లక్ష్మణ కవి ఉత్పల మాల పద్యాన్ని చూద్దాం.

"క్షీరము మున్ను నీటికొసగెన్ స్వగుణంబులు దన్ను జేరుటన్/ క్షీరము తప్తమౌట గని చిచ్చురికెన్ వెతచే జలంబు,దు/ర్వార సుహృద్విపత్తి గని వహ్ని జొరంజనె దుగ్ధమంతలో/ నీరము గూడ శాంతమగు నిల్చు మహాత్ముల మైత్రి యీ గతిన్".

ఈ పద్యం యొక్క భావం పాలు మొదట తనతో కలిసిన నీళ్ళను తనలో ఆత్మీయంగా కలుపుకుని నీళ్ళకు తన రంగు, గుణాలను ఇచ్చి పాలలా మార్చేసింది. అంటే పాలలో ఎన్ని నీళ్ళు కలిపినా నీళ్ళు పాలలాగే ఉండటం మనం గమనించవచ్చు.

తనకు ఇచ్చిన గుణాలకు కృతజ్ఞతగా నీళ్ళు ఏం చేశాయో చూద్దాం. స్నేహితుడైన పాలు వేడవుతూ ఉంటే చూడలేక బాధ పడిన నీరు తాను ఆవిరిగా మారిపోతూ పాలను ఇంకి పోకుండా చూసిందట. ×

పాలలో ఎన్ని నీళ్ళు కలిపినా బాగా వేడి చేస్తే చివరికి అసలైన చిక్కటి పాలే మిగలడం మనం గమనించవచ్చు. ఆ సమయంలో తన నేస్తమయిన నీళ్ళు ఆవిరై పోవడం భరించలేని పాలు ఒక్కసారి గా పొంగి బయట పడు తుంటాయట. అది చూసి పొంగుతున్న పాలపై నీళ్ళు చల్లుతుం టాం కదా! అలా నీళ్ళు చల్లినప్పుడు పాలు పొంగడం ఆగిపోతాయి. ఇలా తన స్నేహితుడైన నీరు తనలోకి వచ్చి చేరడంతో క్షీరం సంతోష పడిందట.

క్షీర నీర న్యాయము

మహాత్ములు అంటే గొప్పవారు. గొప్ప లేదా మంచి మనసున్న వారి మధ్య స్నేహం ఈ విధంగా ఉంటుందని " క్షీర నీర న్యాయము" చెబుతుంది.

ఇలాంటిదే మహాభారతంలోని కర్ణ సుయోధన స్నేహం. కర్ణుడికి రాజ్యం ఇచ్చి రాజును చేసినందుకు కృతజ్ఞతగా కుంతీ కుమారుడు అయినప్పటికీ పాండవులతో యుద్ధం చేసి జీవితాన్ని త్యాగం చేస్తాడు.

త్యాగం, ప్రేమతో కూడిన స్నేహం చేయాలని, అసలైన స్నేహమంటే ఇలా ఉండాలని ఈ క్షీర నీర న్యాయము మనకు తెలుస్తుంది.

-పురిమళ్ల సునంద
9441815722

జీవితంలో సంగీతం భాగస్వామ్యం

సత్యశ్రీనాథ్‌ను సన్మానించిన డాక్టర్ మామిడి హరికృష్ణ.

సంగీతం మానవ జీవనంలో భాగస్వామ్యమని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, సత్యశ్రీనాథ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో సత్యశ్రీనాథ్ మ్యూజికల్ ఈవెంట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ మామిడి హరికృష్ణ, కాసర్ల శ్యాం విచ్చేశారు. సత్యశ్రీనాథ్ మ్యూజికల్ ఈవెట్ జానపద, హిందీ మెలోడి పాటల కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు రంగస్థల కళాకారులను సన్మానించారు. మంకెనపల్లి అజయ్, బీఎంరెడ్డి, డాక్టర్ ఖాజా పాషా మన్సూర్, లక్ష్మీకిరణ్, డాక్టర్ సురభి రమేశ్, ధన్‌రాజు, మురళీధర్ తేజోమూర్తులు, పాచం బావి గోపీకృష్ణ అవార్డులను స్వీకరించారు.

మురళీమోహన్‌కు ఆత్మీయ సత్కారం

కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి మహోత్సవం సందర్భంగా ప్రముఖ సినీ నటుడు ఎం. మురళీమోహన్‌కు సహస్రచంద్ర దర్శనం-సినీ జీవితం స్వర్ణోత్సవం సందర్భంగా ఆత్మీయ సన్మానం కార్యక్రమం శనివారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి అధ్యక్షత వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి మురళీమోహన్‌ను సత్కరించారు. అక్కినేని నాగేశ్వరరావు తెలుగు సినీ రంగంలో ఒక వెలుగు వెలిగిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కిన్నెర ఆర్ట్స్ థియేటర్ వ్యవస్థాపకుడు కిన్నెర రఘురామ్ పాల్గొన్నారు.

పల్లెపట్టుల్లో 'అమ్మయాది' సేవలు అభినందనీయం-డాక్టర్ నందిని సిధారెడ్డి

గత పన్నెండు సంవత్సరాలుగా మారుమూల ప్రాంతమైన బ్రాహ్మణ పల్లి కేంద్రంగా అమ్మయాది పెండెం ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమాలు ఇతర ప్రాంతాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని తెలంగాణ సాహిత్య అకాడెమీ తొలి అధ్యక్షులు ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బ్రాహ్మణ పల్లిలో జరిగిన అమ్మయాది పెండెం ఫౌండేషన్ పన్నెండవ వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను మరువకుండ వాళ్ళ జ్ఞాపకాలను పదిల పరచుకొని వాళ్ళ పేరు మీద ఇలా ఓ సంస్థను స్థాపించి సేవా కార్యక్రమాలను నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు. ఇందుకు సంస్థ వ్యవస్థాపకులు పెండెం సత్యనారాయణ అభినందనీయులని కొ నియాడారు. దేవతలు అందరూ ఒక వైపునా, అమ్మ మరో వైపునా ఉంటే నేను మా అమ్మ వైపే మొగ్గుతాను అన్న మహాకవి సినారె కవితా పంక్తులను గుర్తు చేస్తూ ప్రతి మనిషికీ తన జీవితంలో అత్యంత విలువైన బహుమతి అమ్మే అన్నారు. చిన్నప్పుడు ఆ అమ్మ మనకు చేసే సేవలు వెల కట్టలేనివని, అలాంటి అమ్మకు వృద్ధాప్యంలో సేవలు చేసి కన్న రుణం తీర్చుకోవాలని అదే అసలైన పేగు బంధం అని అన్నారు. సభాధ్యక్షులు పెండెం సత్యనారాయణ మాట్లాడుతూ మా అమ్మ సోమక్క నాకు జన్మ నివ్వడమే కాకుండా విద్యాబుద్ధులు నేర్పించి ఇంత వాడిని చేసిందన్నారు. విద్యాగంధం అంతగా లేకున్నా లోక జ్ఞానం మాత్రం అపారంగా ఉండేదన్నారు. మాకు ఏ లోటూ రాకుండా చూసుకున్న ఘనత ఆమేకే దక్కిందన్నారు. అలాంటి అమ్మ పేరు మీదుగా ఇలా సేవా కార్యక్రమాలను నిర్వహించడం ఆ అమ్మే మాకు కల్పించిన అవకాశం అన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ప్రముఖ సాహితీవేత్త, లోకకవి డాక్టర్ అందెశ్రీ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ తల్లైనా ఇలాంటి బిడ్డలనే కోరుకుంటుంది. ఉన్నప్పుడు మంచిగా చూసుకోవడంతో పాటు వాళ్ళ తదనంతరం కూడా ఆ జ్ఞాపకాలు పదిల పరచుకొని ఇలా సేవా రూపంలో తలచుకోవడం గొప్ప విషయం అన్నారు. ప్రముఖ కవి కందుకూరు శ్రీరాములు ఈ సందర్భంగా ప్రసంగిస్తూ అమ్మ మనకు జన్మనివ్వడం మాత్రమే కాదు, తన బిడ్డను మనసు పొత్తిళ్ళలో పెట్టుకొని కంటికి రెప్పలా కాపాడుకుంటుంది. ఆకాశమంత ఎత్తుకు తన బిడ్డ ఎదిగినా ఆమె దృష్టిలో మాత్రం ఇంకా తొలి అడుగులు వేస్తున్న పసి ప్రాయంగానే భావిస్తుంది. అమ్మ మనసు అలాంటిది అని అన్నారు.

డా॥నాళేశ్వరం శంకరంకు 'అమ్మయాది' జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేస్తున్న డా॥ నందిని సిధారెడ్డి, పెండెం సత్యనారాయణ-లక్ష్మిదంపతులు, డా॥ అందెశ్రీ, కందుకూరి శ్రీరాములు తదితరులు.

ఈ సందర్భంగా ప్రముఖ కవి, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరంను అమ్మయాది జీవన సాఫల్య పురస్కారంతో, ఆలేరు శ్రీరామకృష్ణ విద్యాలయం అధినేత బండిరాజుల శంకర్ ను విద్యారంగ సేవా పురస్కారంతో ,తుర్కపల్లికి చెందిన కవి ఉపాధ్యాయుడు పెసరు లింగారెడ్డిని ఉత్తమ సాహితీ వేత్త పురస్కారంతో, చేర్యాల ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయురాలు పాశికంటి వెంకట రమణను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో,ఆత్మకూరుకు చెందిన ఉపాధ్యాయుడు ప్రజా భారతి పూర్వ అధ్యక్షుడు తొర్ర ఉప్పలయ్యను సాహిత్య సేవా పురస్కారంతో ఘనంగా సత్కరించారు. అదే విధంగా ఐదవ, పదవ తరగతి, ఇంటర్‌లలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. బ్రాహ్మణపల్లి గ్రామ స్థాయిలో నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. పురస్కార గ్రహీతలు స్పందిస్తూ ఈ అమ్మయాది పురస్కార సత్కారం మా బాధ్యతను మరింత పెంచిందన్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఎం. డి .ఖలీల్, బ్రాహ్మణ పల్లి గ్రామ సర్పంచ్ సంధ్యా శ్రీనివాస్, రైతు వేదిక కోఆర్డినేటర్ శ్రీనివాస్ , అమ్మయాది ప్రధాన కార్యదర్శి పెండెం లక్ష్మి,మహాకవి సినారె కళాపీఠం అధ్యక్షుడు మల్లె కేడి రాములు,జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి బండారు జయశ్రీ రోటరిక్లబ్ భువనగిరి పూర్వ అధ్యక్షులు బండారు శ్రీనివాస రావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ గంగాధర్ దంపతులు, ప్రముఖ కాంట్రాక్టర్ మహేష్ బాబు, పెండెం పరందాములు ప్రజాభారతి గౌరవాధ్యక్షుడు ఎస్. ఎన్.చారి, ప్రజా భారతి అధ్యక్షుడు ప్రముఖకవి దేవినేని అరవింద రాయుడు, ప్రధాన కార్యదర్శి గుమిడెల్లి వెంకన్న, మర్రి జయశ్రీ, కాంబోజు మహేందర్, గొడుగు బాలరాజు, రాపోలు అశోక్ జవ్వాజి మహేందర్, మనోహర్, పోరెడ్డి రాజేశ్వరి, మచ్చెందర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

వివిధ రంగాలలో పురస్కార గ్రహీతలు

శ్రీమతి పాశికంటి వెంకటరమణ, బండిరాజు శంకర్, పెసరు లింగారెడ్డి, తొర్ర ఉప్పలయ్య.

బహుజన సాహితీ నిధి బి.యస్.రాములు

బి.యస్.రాములు గారూ..

మీరు పంపిన కొత్త పుస్తకములు అంబేద్కర్ రీసెట్ సెంటర్ లో వెలుగులు చిమ్ముతున్నాయి. నిజానికి ఇటీవల మీ పుస్తకాల ముఖచిత్రాలు, పుస్తక నిర్మాణం కొత్త పుంతలు తొక్కుతున్నది. మీరు పంపిన పుస్తకాల్లో అత్యున్నతమైన గ్రంథం **"బౌద్ధం-సోషలిజం-మార్క్సిజం-అంబేద్కరిజం"** కొన్ని లక్షల పుస్తకాలు ముద్రించి దళిత బహుజనుల చేతికి అందించాల్సిన గ్రంథం. ముఖ్యంగా మీరు పంపిన దాంట్లో **"పాట పుట్టుక"** చాలా గొప్ప గ్రంథం. ఎందుకంటే పాటల సృష్టి చెప్పడం చాలా కష్టం. మీరు ఈ పాటలు గ్రంథంలో కొన్ని వేల మంది కళాకారుల సృష్టికి ప్రోత్సాహాన్ని ఇస్తున్నారు. ఇటువంటి నూతనమైన అలంకార శాస్త్రము, ప్రత్యామ్నాయ సంస్కృతికి పునాదులు. మరి ముఖ్యంగా గూడ అంజయ్య గారు, గద్దర్ గారు, వంగపండు గారు త్రిమూర్తులు. దళిత బహుజన పాటల సృష్టికర్తలు. వారి గురించి ఎంతో పరిశోధన జరగవలసి ఉంది. ఈ పుస్తకాలు వాటికి పునాదులు వేస్తున్నాయి. "అవగాహన" అనే మరో గ్రంథం పంపారు. ఈ పుస్తకం మేకింగ్ అద్భుతంగా ఉంది. దీనిలో మీరు 1985 కారంచేడు ఉద్యమ స్ఫూర్తి దేశాన్ని కదిలించింది అని ప్రారంభించారు. అంబేద్కరిజం పట్ల నూతన దృష్టి పెరిగింది అని చెప్తూ దళిత బహుజన మేధావులను తాత్విక ఆవిర్భావాన్ని నిజాయితీగా చెప్పారు. నిజానికి కారంచేడు ఉద్యమానికి ముందు సాహిత్యం వేరు. కారంచేడు ఉద్యమానికి తర్వాత సాహిత్యం వేరు. ఈ సాహిత్య చారిత్రక భౌతిక వాద తాత్విక విశ్లేషణలో నూత్నమైన పోకడ వచ్చింది. లెఫ్ట్ క్యాంపు నుంచి వందల మంది దళిత బహుజనులు సాహిత్యోద్యమం లో రిక్రూట్ అయ్యారు. చరిత్ర నిర్మాణంలో స్త్రీల పాత్ర అనే చాప్టర్ అద్భుతంగా ఉంది. మీరు ప్రతి చాప్టర్ లో మీ బొమ్మ తీసుకురావడం కూడా రైటర్ యొక్క వ్యక్తిత్వ వికాసం **"అవగాహన"** గ్రంథంలో ఉంది. మీరు తెచ్చిన **"సంభాషణ"** అనే మరో గ్రంథం ముఖచిత్రంలో గ్రీన్ బ్యాక్ గ్రౌండ్ నుంచి నల్లకోటుతో మీరు ఒక డిబేటర్ గా మెరిసిపోతున్నారు. 'సంభాషణ' అనే వైట్ ట్వింట్ అక్షరాలు కొట్టొచ్చినట్టు ఉన్నాయి. ప్రజాస్వామ్యం-బీసీలు సంస్కృతి స్ఫూర్తి దాతలు ఎల్లో కలర్ లో మెరిసిపోతుంది. డిజిటల్ ప్రింటింగ్ లో ఈ బుక్ చూపరులను ఆకట్టుకుంటుంది. పుస్తకంలోకి వెళితే బీసీల సాధికారతకు మీరు సామాజిక ఆర్థిక సాంస్కృతిక రంగంలో విస్తృతమైన వేదికను నిర్మించారు. సంభాషణ అనడంలోనే చాలా కొత్తదనం ఉంది. నాకు చలం మ్యూజింగ్స్ గుర్తుకొచ్చింది. తాపీ ధర్మారావు గారు కూడా **"ఆలిండియా అడుక్కు తినే వాళ్ళ మహాసభ"** పుస్తకంలో కూడా సంభాషణా శైలి ఉంది. మీ పుస్తకాల్లో హిస్టారికల్ ఎవిడెన్స్ ఉంటుంది. సమకాలీనమైన నామవాచకాలు విపరీతంగా వస్తాయి. మీతో మాట్లాడిన వారి అందరిని మీరు వీలున్నంతవరకు మీ పుస్తకాల్లోకి తీసుకువస్తారు. మీ టైటిల్స్ అన్నీ చూస్తుంటే ఒక రచయిత ఇంత వైవిధ్యభరితమైన రచనలు చేయగలడా?! అనిపిస్తుంది. ఇక ఇంగ్లీషులో వేసిన **"బుద్ధిజం - సోషలిజం - మార్క్సిజం - అంబేద్కరిజం"** అనే పుస్తకంలో నా గురించి కూడా రాశారు. అన్ని పుస్తకాల్లో నన్ను ప్రస్తావించటం మీ స్నేహ పరిమళాల సౌగంధ్యానికి నిదర్శనం. నిజంగా మీరు ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘ చరిత్రను మీ పుస్తకంలో బాగా లిఖించారు. మీరు ఇంగ్లీషు గ్రంథం ట్రాన్స్‌లేషన్ కూడా పెద్దగా చేయించారు. అది తెలుగు పుస్తకం చదువుతున్నట్లు లేదు. ఇంగ్లీషు పుస్తకం చదువుతున్నట్టే ఉంది. మీ పుస్తకాలు అన్నింటిలో మనిద్దరి సంభాషణ వెల్లివిరుస్తుంది. నిజానికి మీ నిరంతర వ్యాసాంగం కమిట్మెంట్‌తో కూడినదిగా కనబడుతుంది. యు ఆర్ ఎ బ్రిలియంట్ రైటర్. ఇక హెగేల్ కాంట్రడిక్షన్స్ ని మీరు అర్థం చేసుకున్నారు. మీరు పంపుతున్న పుస్తకాలని బట్టి ఒక బీరువానే మీకు లుంబిని వనంలో కేటాయించాము. మీరు ముఖ్యమైన మార్క్సిస్టు గ్రంథాలుగా చెప్పిన **"కమ్యూనిస్ట్ మేనిఫెస్టో", "జర్మన్ ఐడియాలజీ", "యాంటీ డ్యూరింగ్", "డైలెక్టిక్స్ ఆఫ్ నేచర్"** ఇవన్నీ మన గ్రంథాలయంలో మీ పుస్తకాలతో పాటు ఉన్నాయి. అందుకు లుంబిని వనం ఆనందిస్తుంది. లుంబిని వనానికి మీ గ్రంథాలే కాక మీ లైబ్రరీ నుండి మాకు ఇవ్వగలిగిన గ్రంథాలు కూడా పంపగలరని ఆశిస్తున్నాను. టైటిల్ మీద నేను మీ గురించి రాసిన మాటలు ముద్రించారు. **"బిఎస్ రాములు యాజ్ అప్లయ్డ్ అంబేద్కర్స్ థాట్ టు ది మోడ్రన్ సొసైటీ అండ్ ఎక్స్టెయిన్డ్ ఇట్ ఇన్ దీటెయిల్డ్ ఇన్ దిస్ బుక్"** అని పేర్కొన్నారు. అది నాకు ఎంతో ఆనందాన్నిచ్చింది. మీ ప్రేమ మరువరానిది. మీ ఆత్మీయత కొలవలేనిది. మీ స్నేహం నిరంతర ప్రవాహశీలమైనది.

-డాక్టర్ కత్తి పద్మారావు
9849741695

'కబోది చేపల కబుర్లు' ఆవిష్కరణ

కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న అతిథులు.

ఈనెల 24న సుందరయ్య విజ్ఞానకేంద్రం,బాగ్ లింగంపల్లి, హైదరాబాద్‌లో కవిసంగమం నిర్వహణలో తెలుగు వెంకటేష్ నాలుగో కవితా సంపుటి 'కబోది చేపల కబుర్లు' ఆవిష్కరణ షోయబ్ హాల్‌లో జరిగింది. కవి ప్రసాదమూర్తి ఈ సభకు అధ్యక్షత వహించారు. ప్రసిద్ధ కవి కె.శివారెడ్డి ఆవిష్కరణ చేస్తూ తెలుగు వెంకటేష్ కవిత్వం అత్యాధునికత స్థాయికి చేరుకుందని, కవితా నిర్మాణంలో విభిన్నతను చాటుకున్నాడని అన్నారు. ఇతని కవిత్వంలో తాను చాలా నేర్చుకున్నానని అన్నారు. వక్తలుగా సత్య శ్రీనివాస్, కవియాకూబ్, మెర్సీ మార్గరెట్‌లు పాల్గొని వెంకటేష్ కవిత్వంలో వైవిధ్యత, అభివ్యక్తిలో భిన్నత ఆకట్టుకుంటాయని అన్నారు.

దేహము-జీవుడు

చలితోమెల్లగ సన్ననౌ జ్వరము సామాన్యమై తీవ్రమై
తలలో నొప్పియు కాళ్ళు చేతులవియున్నడ్డంబు దిడ్డంబు గా
చలనం బెంతయు కష్టమై పలుకు లస్పష్ట మై రాగ క
న్నులు తామంతగ మూతలయ్యె నిక నన్నున్నేను మైమర్వగన్.
వైద్యశాలను మంచాన పడగ వేసి
చేయి పట్టిపట్టక నాడి వాయి యేమొ
యేమి చూసెనో వైద్యుడదేమి యనెనొ
సూదినాళము తొడిగించి సూటిగాను
రసము లేవియో నా మేన ప్రాకజేసె.
మూడు పూటల మాత్రల వాడుమనుచు
మ్రింగ జేయుచు నుండిర మితములుగను
జీవునకు లొంగనట్టి విశేష తనువు
తానె అధికారి , జీవుడు దాసుడయ్యె.
దేహమొకయింత మెరుగైన యూహ కలుగ
మరల నుత్సాహమును జూపు మనసు కూడ
కోరు తీరొక్కరుచులను నోరు కూడ
జీవుడింద్రియాశ్వము లెక్కి రీవి జూపు.
ఇల్లు ఇల్లాలు పిల్లలు నెల్ల పనులు
తొందరించెడు మనసంత సందడింప
మనిషి వ్యగ్రత యేగాని మార లేదు
దేశమును వాడ కట్టును లేశమేది
బ్రతుకు తెరువున పడిపోవు పాతదనమె.
జ్వరము విడిది చేసెను నాదు వపువు నందు
మదిని వైరాగ్యమొకయింత మసలి చనియె
దేవుడును వచ్చి మనసులో తిరిగి పోయె
నయము దేహికో జీవికో నైజ మెరుగ.
ఏమి పోరాటమిద్దియో యెఱుగ రాదు
దేహ మును నిల్పుకొనుటకై తీవ్రుడగును
ఏమి యారాట మిద్దియో యెఱుగ లేము
జీవుడును మోక్షమందగా చిక్కు వడును

-డా. గండ్ర లక్ష్మణ రావు
9849328036

నీవు సల్లగుండాలె

(వచన కథా కావ్యం-35)

చట్టం గొప్పదే కాని,
చాలా సార్లు మంచివాళ్ళ చేతుల్నే
కట్టేస్తుంది!
కాలం ఉక్కు కౌగిలిలో నలిగిపోతుంటుంది!.

ఆవేదనలో కునారిల్లుతున్న హృదయాలకు
సత్వర న్యాయం కావాలి
అన్యాయ వర్తనులను ఉపేక్షిస్తే
న్యాయం ఉరేసుకుంటూనే ఉంటుంది !

డి.ఎస్.పి. సింధు తనచేతులకు
మట్టి అంటకుండా కాగల కార్యాన్ని గురించి
కొందరు గంధర్వులను రంగంలోకి దించింది!
అత్యాచార కుట్రదారుని కూతురునే
ఎరగా మార్చి,
దోషులను అందరి ముందుకు తెచ్చింది!

రాజకీయం కోసం
పసిపిల్లలను పాడుచేసే
నీచ్ కమీనే కుత్తే గాళ్ళ నిజస్వరూపం
అంగడి వీధిలో కుప్పబోసింది !
కుడితిలో ఎలుకలను చేసింది!
ఏమీ ఎరుగనట్లు
సకాలంలో రంగప్రవేశం చేసింది...
వంచకులు తమ వేలితో
తమ కంటినే పొడుచుకునేటట్లు చేసింది !
అందుకు ఆడపిల్లలే కాదు
వాళ్ళ తల్లులు చూపిన చొరవను

అభినందించింది !

అదంతా సరయూ చొరవవల్లనే నని
స్త్రీ శక్తి పరస్పర స

అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వికారాబాద్ వారం వారం నిర్వహిస్తున్న వాట్సప్ కవిసమ్మేళనంలో భాగంగా ఈ వారం...'ప్రపంచ పర్యాటక దినోత్సవం' శీర్షిక కోసం వచ్చిన కవితల్లో మేలైనవి కొన్ని...

–దోరవేటి, అనంత వ్యవస్థాపకులు

దామగుండ క్షేత్రం

సీ
దట్టమైన యడవి చుట్టూర నిలువగా
కొండల మధ్యలో కొలువుతీరె
పక్షుల కిలకిల ధ్వనుల నాదములాడ
జీవజాలము నొప్పు శ్రేష్ఠధాత్రి
మునిపుంగ వాత్మజ పుణ్యతీర్థ మదియె
గుహల దర్శనము లగుపడు సాక్షి
శ్రీరాముని కరముచేత ప్రతిష్ఠిత
మైన లింగ మనెడి నానుడి గల
తే.గీ/
పంచ గుండములున్నట్టి భవ్య దామ
కాకతీయుల చేతనే కట్టబడిన
శాసనమ్ములు గల్గిన వాస మదియె
దామగుండము చూడగ తరలి రండి !!!

–దివాకర శాస్త్రి

ఏకాంబరీశ్వరా నమో నమః

నీళ్లపల్లి గ్రామంలో,
దట్టమైన వన సీమలో
శ్రీరామునిచే ప్రతిష్ఠితుడవై
పూజలందుకుంటున్న
ఓ జంగమయ్యా!
ఏడు గుండాల నడుమ నీవు
వెలిగి పోతుంటావు
పేద వారికి ప్రేమ పంచుతుంటావు
పల్లె సీమల భక్తి పెంచుతుంటావు
ఇదియె దక్షిణకాశి
ఇది ప్రకృతి ఒడిలోన
కదలుతున్నట్టి మా వారణాసి
కులమతాల కలుషమే అంటజాలని
జానపదుల విమల పుణ్యాల వారాశి
ఉత్సవాల్లో నీకు ప్రత్యేక పూజలు
యాకూబు భక్తుడే
నీకు వత్సయాయెనట !
అతని పేరును
కలుపుకొన్న కాళేశ్వరా !
ఏకాంబరీశ్వరా శరణు!శరణు!!!

–శైలజా చెంచు,
తాండూరు.

భద్రాద్రి

ఆకురాల్చని చెట్ల నక్కునందిదుకుని
చెక్కిళ్ల మెరయంగ చిత్రరథుడు
పారేటి గోదారి పరవళ్ళనే జూచి
పరవశించె? నలరు పాపికొండ
సీతమ్మ సిగపూలు, సిగ్గులే సవరించి
రామయ్య నగుమోము రత్నమవగ
సౌమిత్రి నిర్మించ సౌభాగ్య మిదనంచు
పరితుష్టిగను మ్రొక్కె పర్ణశాల!!
ఆ/వె
దినము దినము తనదు దీవసమ్ముల తోడ
మనసు తనదు వైపు మరలు నటుల
తనువు బోక ముందె తరియించగా వేల్పు
వెలయ జేసె నిట్టి వేల గుడులు!

–మల్కనెల్లి లాల్ రెడ్డి
'అనంత' సాంస్కృతిక
కార్యదర్శి.

పిట్టగూడు

శిల్పిచెక్కని కట్టెపుల్లల్ని మోసుకొచ్చి
ఎండుగడ్డితో నీటినేల మీద
ఇల్లల్లే శిల్పి నువ్వు
పగలంతా ఎక్కడికోతుందో
చీకట్లో ఎట్ల చేరుకుంటుందోనని
మనుషులకు గొప్ప పాఠమైతవు!

పుట్టిన పిల్లల్ని కొమ్మకు ముట్టజెప్పి
సందమామను చెట్టుకింద దీపం చేసి
నరులకర్థం కాని పిట్టగూడల్లుతావు!

నీ పనితనం చూడానికి పానాదెంటా
మోట బాయి కాడికి
పీటీ ఉషను కండ్లల్ల నింపుకొని
ఉరుక్కుతుంటిమి!

చెట్టునిండా పిట్టగూడులు
రంగు రంగుల పిట్టలు
అప్పుడే పుట్టిన పసకూనలు
లేత చిగురుపూతల్ని
ఆకలిముద్దులతో కలిపి తినిపించే
ఆ కమ్మటి దృశ్యాన్ని
ప్రపంచ పటంలో ఎక్కించి
గుగుల్ తల్లితో వెతికించాల్సిందే!

ఎత్తైన మేడల్లో ఉండే మనుషుల్లారా
టికెట్ బుక్ చేసుకునే ముందు
ఓ సారి కూలిపోయిన
మా బాయి కాడికి రండి
ఈ నేల మీద
ఎన్ని పర్యాటక పేజీలున్నా
ఈ పిట్టగూడుపద్యం
ఓ సారి సదివిపోదురు!

–చిగురాల్ పల్లి ప్రసాద్
పరిగి

మిరాకిల్ మిరిక్

అందమైన ఆశాదీపం
ఆత్మానందానికి అందలం
ఆరువందల మీటర్ల ఎత్తులో
ఆకాశవీధిలో అలరించే అనుభవం.
భారతావనికి ఈశాన్యదిక్కున
బెంగాల్ కి బహు సమీపాన
డార్జిలింగ్ ల కనిపించే
డార్జిలింగ్ శిఖరంచున ప్రపంచాన్నే
మిలమిల మెరిసే మంచుగడలతో
పలకరించే
మిరిక్(పర్యాటక స్థలం) .
ఊటీని తలపించే తేయాకు తోటలు
ఎడుకొండలను మైమరిపించే
సహజమైన మంచు కోటలు
సుడులు తిరిగిన
సప్తసర్పాలను తలపించే
సాహస రహదారులు
పైకివెళ్ళుతున్న కొద్ది పరవసింపజేసే
పచ్చదనపు పందిళ్ళు
రహదారి వెంట రాలిపోయిన
చంద్రకాంత శిలలగుర్తులు
మధ్యమధ్య వచ్చే మైనపు
పూతలాంటి మేఘాల ముసురు
తాకగానే శరీరం శరీరంలోనే సగమైపోయి
చందమామ కథల్లోని మాయా కంబళి వంటి
తెల్లటి తెరచాప మేఘాల మీద
పయనిస్తున్న అనుభూతి
ఆకాశదీపాన్ని అందించుకున్నటున్నది
పర్వత శిఖరం పైన
స్వచ్ఛ స్ఫటిక సమానమైన
సుజల సరస్సులు
చూపును తిప్పుకోనీయవు
సరస్సులో హంసల్లా విహరించే
విహంగాల హంగులు
పక్కనే
పరమ శాంతి సోపానం లా
ప్రసిద్ధ బుద్ధాలయం ...
అడుగడుగునాకుప్పబోసిన అందాలు
మనసును
మరో లోకంలో విహరింపజేసే
అద్భుతాలు
భూలోక స్వర్గమనిపించే
దృశ్యాలు
ఒక్క ప్రయాణం
ఆయుష్షు ను వేయింతలు చేసే
మిరాకిల్...ఆ మిరిక్

–రెడ్యా రాథోడ్,
వికారాబాద్

మన దేశ పర్యాటకం

దేవాలయాలలో దేశీయ సంస్కృతీ
విగ్రహ మూర్తుల వెలుగు జిలుగు
రాజుల గౌరవ రాజస దేదీప్తి
కోటలై తలలెత్తి కొలువుదీర
నదులెల్ల గోవులై పొదుగుల పాలను
పొరలించు దాతృత్వ సరళి గాంచి
రమణీయ దృశ్యాల రాజుల వైభవ
భవనాల సౌభాగ్య ప్రాభవాలు.

మాతృపుత్ర బంధ మమకార మాధురీ
హృదయ సదన మందు మెదులుచుండు
కుట్లు వేసినట్లు గుండెల జతగూర్చు
వేల యేండ్ల నాటి విలువ చాటి.

కన్నించు ముంగిట కత్తులు దూసిన
పగవాని దుశ్చర్య పాఠమచట
వినిపించు స్వార్థపు విషనాగు కాటుకు
బలియైన రాజ్యపు బరువు గాథ
వివరించి శోభిల్లు విఖ్యాత రాజ్యపు
ముద్రలు ముదమార మురియునటుల
పెంచును వీరుల మించిన త్యాగాల
గుర్తులు తడుమును ఆర్తి మీర.

గతపు కాలమెల్ల ఘనమైన పాఠమై
గాఢమైన రీతి కాంతులద్దు
దేశజనత కెపుడు దిక్సూచి చిహ్నాలు
నిలువుటద్దమట్లు నిలిచె చూడు

–ఆకుల మల్లికార్జున్,
షాద్ నగర్

అనంత గిరి సోయగం

మనసుకు హాయి గొలుపుతూ
నయనానందాన్ని ప్రసాదిస్తూ
గిరుల మాటునుండి పలకరించే
భానుడి కిరణాల తో
ప్రకాశిస్తూ
పరవశించి పోయే పవిత్ర ప్రదేశం
వ్యతిరేక ఆలోచనలతో
తల్లడిల్లే మనసులకు
కన్నతల్లి ఊరడింపై
సమస్త వ్యాధులకు
చికిత్సా భిషగ్వరమై.

రహదారులకిరువైపుల
ప్రేమ సమీరాలను వీచే తరువులతో
సకల జీవరాశులకూ పుట్టినిల్లై
మరులు చెరగని బాలింత సోయగం
ఈ అడవి తల్లి.

చినుకు తడి తాకిడి సైగతో
భూతల్లి కి పచ్చని చీరను కట్టి
తాను పచ్చల పతకాలను
పొదవుకుంటుంది
వచ్చే పోయే వారికోసం
తానే ఓ పచ్చ తివాచీగా మారిపోయి
అతిథులను
వాత్సల్యంతో
అక్కున చేర్చుకుంటుంది
అందం, ఆహ్లాదం,
పచ్చదనాన్ని మించిన చల్లదనంతో
తెలంగాణ ఊటీ
అని పిలిపించుకుంటుంటే
మనసుకు గిలిగింతల పులకింత.

ప్రకృతి మాత సోయగాల వంపులలో
లేడిపిల్లలా గంగమ్మ ఉరకలేస్తుంటే
ఆ సెలయేటి గమకాలకు
అనువైన నర్తన చేసే
నెమళ్ళ హ్వాయల్లు
గుండె ఝల్లుమని పిస్తుంటే
ప్రకృతి ప్రేమికుల
నందనవనమై
బాధలకు లేపనమై
వ్యాధులకు దివ్యౌషధమై
చరిత్రలో చెరగని పుటగా
నిలిచిపోయింది
మా–అనంతగిరి సోయగం

–జోరు.పవిత్ర క్రిష్ణ
కౌన్సిలింగ్ సైకాలజిస్ట్
వికారాబాద్

పర్యాటకం

ప్రపంచ పర్యాటకం
సృష్టి తల్లి జాతకం.!
ఝరుల సిరులు పొంగి పొరలె
పుడమి లోన నాటకం.!!.

చింతలన్ని బాపును
గాయాలను మాన్పును.!
నూతన జవసత్వ మిచ్చి
శక్తి యుక్తి నింపును.!!.

ఆలోచన పెంచును
ఆదరణను పెంచును.!
సాటిజీవ జాతుల పై
జ్ఞాన మెంతొ ఇచ్చును.!!.

కూడు గూడు నిచ్చును
తల్లిగ నిను జూచును.!
చల్లని ప్రేమను బంచి
ఒడిలొ నిన్ను పెంచును.!!.

సృష్టి నేర్పు తున్నది
మనసు మీటు తున్నది.!
పరుల కొరకె తనువంటు
పదము పాడుతున్నది.!!

–గోవింద వాణి
తాండూరు

యాదాద్రి మణిపూసలు

యాదాద్రి శిల్పకళా
పనితనం చూడు భళా
సృష్టికి ప్రతిసృష్టి చేయు
శిల్పుల కళ తళ తళా!.

శిల్పకళా వైభవము
శిల్పులకే సంభవము
స్వామి దీవెన పొందని
శిలలన్ని నిర్జీవము!.

కవుల కలం గొప్పది
శిల్పుల ఉలి గొప్పది
ప్రకృతిని నడిపించెడి
శక్తి యింక గొప్పది!

శిల్ప కళకు చిత్తమే
కవన కళకు చిత్తమే
సకల కళల కాధరం
సాలోచన చిత్తమే!.

"కళలు"ఏవి అయినగాని
కళాత్మకత వుంటె, దాని
జీవితమే శాశ్వతమగు
ఎన్ని యేండ్లయినను భువిని!

–వడిచర్ల సత్యం
అనంత ఉపాధ్యక్షులు
7989511543

అందాల కనువిందు

అల్లూరి సీతారామరాజు
పదస్పర్శ తో పులకించిన నేల
సుందర దృశ్యాలతో
కనువిందు చేసే నేల.

గల గల మని పారే
అలుపెరుగని సెలయేర్లు.

రెప్పవాల్చ నీయని
ఆకాశం పైకెప్పుతో
సరసాలాడే మేఘ కన్నియలు.

నీలి గగనాన
పగలు విరిసిన హరివిల్లు నిశిలో
మిల మిల మెరిసే తారకల విరిజల్లు
చీకటి సముద్రంలో
మిణుగురుల కాంతి తరంగాలు
కళ్ళు తిప్పుకోనీయని
సహజ సుందర లోయలు
కోయిల పాటల వసంతాలు
దిరిసెన పూలను
తలలో తురుముకున్న
పర్వత పుత్రిని గుర్తు చేసే
కొండ కోనలు..
కొండల్లో దూకే జలపాతాలు
భూమాత కు పచ్చని చీరను
అలంకరించిన పచ్చిక మైదానాలు
కోనల్లో కొలువైన అందాలు
మట్టి వాసనలను వెదజల్లే
వానచినుకులు
ప్రేమతో స్వాగత గీతాలు పాడే
అందమైన పూల తోటలు
ఆకుల చాటున దాక్కున్ని
బిడియాల నొలకబోసే కొత్త మొగ్గలు
హాయిగొలిపే పిల్ల తెమ్మరలు
ఇంకా...
మాటలలో చెప్పలేనివి,
అక్షరాలకు అందలేనివి,
కనులకు కమనీయమైనవి,
మనస్సుకు మనోహరమైనవిఅరకు
లోయలో
మరో లోకంలో
విహరింప జేస్తాయి.

–సదీదుద్దీన్ అన్సారీ,
వికారాబాద్

కేరళ

కం:
కేరళలో టీ తోటలు
హోరము వలె దారి వెంట హరితపు నగలై!
చూర గొనును మానసములు
పారెడి జలపాతములును పరవశమొందన్!
కం:
మెలికలు తిరిగెడు దారులు
చలువల పందిళ్ళవోలె చక్కని తరువుల్!
తలుకులు జిందెడి పార్శులు
విలువగు లాడ్జీల గదులు వినయపు జనులున్!
కం:
కేరళ యప్పము గొప్పది;
తీరందము జూడగానె తినుమను మనసే!
బేరము లాడరు నెక్కడ
పోరరు వారెవరి తోడ పొసగెడు జనులున్!
కం:
తక్కువ మైదానమ్ములు
తక్కువ వ్యవసాయ మచట తక్కువ గ్రామాల్!
ఎక్కువ చదువరు లుందురు
మక్కువతో మాటలాడి మనసును గెలువన్
5 కం:
నల్లని బారుల కచములు
నిల్లిల్లును గానవత్తు రింతులు జూడన్!
పల్లెల పట్టణ మైనను
నల్లిన జడగానరాదు నతివల కెపుడున్!

–మహ్మద్ షరీఫ్
9866560527

ప్రకృతి అందాలు

పరమేశ్వరుని వరప్రసాదం
ప్రకృతి సౌందర్యం
సుందర వనాలు,
మదిని దోచే మనోహరమైన ప్రదేశాలు...
జలజల జారిపడే జలపాతాలు
గలగల పారే సెలయేళ్ళు
మంచు పర్వత సోయగాలు
ప్రపంచాన్ని మరపించే
ప్రదేశాలు...
భాషకందని వింతలు,
ఊ ఊహకందని వినోదాలు
ప్రపంచం పరదా చాటున
దాగిన ప్రకృతి అందాలను..
పర్యటించి చూద్దాం...
మధురానుభూతులను
మది మందిరంలో నిలుపుకుందాం...
మనసారా ఆరాధిద్దాం...

–ప్రతిభా భారతి.
తాండూరు.

పుస్తక సమీక్ష

కవి వేణుశ్రీ కవితా హృదయాన్ని ఆవిష్కరించిన డా॥ సరిపల్లి కృష్ణారెడ్డి

'ది లిటిల్ బుక్ ఆఫ్ ఎవిరిథింగ్ (వేణుశ్రీ–పోయెమ్) కవిత్వ విశ్లేషణాత్మక రచనను డా॥ సరిపల్లి కృష్ణారెడ్డి ఆత్మీయంగా వ్యక్తీకరించిన పరిశో ధనా వ్యాస స్థాయి భావాలను అశ్వినీ ప్రచురణలు వెలువరించారు. కవి వేణుశ్రీతో నాలుగు దశాబ్దాల సాన్ని హిత్యం, ఆయన వ్యక్తిత్వం, కవిత్వం లోని ఉన్నత భావాలను విమర్శ, విశ్లేషణ దృక్కోణంతో డా॥ కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థి దశ నుండే వామపక్ష భావోద్వేగి అయిన డా॥ కృష్ణారెడ్డి, విద్యాధికునిగా నవలా, వ్యాస రచయితగా ప్రతిభావంతులు కావడంతో, అభ్యుదయ ప్రగతిశీల రచయితగా వచన కవిత్వం, పద్య కావ్యాలు, నాటకాలు, కథలు, వ్యాసాలు వివిధ ప్రక్రియలలో సత్కృషి కొనసాగిస్తున్న కవి వేణుశ్రీ కవిత్వ, జీవన తత్వ విశ్లేషణలో, సఫలీకృతులు కాగలిగారు. ప్రవేశిక, కవి జీవిత విశేషాలు, రచనలు మూడు అధ్యాయాలుగా వివరించారు. **'నది సంద్రంలో అల్లాడే జన మనుగడ పడవను ఒడ్డుకు చేర్చాలని యత్ని స్తున్న నావికుణ్ణి నేను' 'విషాద భారతి' కవిత, 'మరో పిలుపు', 'మతాధిప తులు', 'ప్రశ్న'** ఏ కవితను విశ్లేషిం చినా కవి వేణుశ్రీ ప్రజాస్వామ్యంలో మానవ విలువలను గురించిన బంధుప్రీతి, కులపిచ్చి, మతోన్మాదం వంటి భావాలను దైనందిన రాజకీయ అంశాలను ప్రస్తావించడం గురించి కూడా విశ్లేషించారు. తెలంగాణ రాష్ట్ర సాధనా మలి ఉద్యమంలో సత్కృషి, వేణుశ్రీ రచనలను వ్యాసకర్త ఉదమరిం చారు. డా॥ సరిపల్లి ప్రముఖ న్యాయశాస్త్ర కోవిదునిగా, న్యాయస్థానం ఎప్పుడూ అపహాస్యం కానేనదని కూడా స్పష్టం చేస్తారు. వైవిధ్యతో కూడిన నా దేశం, వ్యామోహం, తంత్రాలు– కుతంత్రాలు, వారసత్వం, గురువంటే, ప్రజాభారతం, ముట్టడి, రక్తాన్ని చిందించకండి, ఎన్నికల ఏడాది, మహిళ అంటే, స్నేహం, అన్ని కవితలను పరిశీలించి వ్యాఖ్యాత, వ్యాసకర్త, విశ్లేషకునిగా ప్రథమ భాగాన్ని తనదైన శైలి, భావ వ్యక్తీకరణలతో డా॥ సరిపల్లి కవి వేణుశ్రీ కవిత్వ హృదయాంతర్గత ఔన్నత్యాన్ని వ్యాస ప్రక్రియలుగా, సంపుటీకరిస్తారు. అనుబంధంలో కవిగా వివిధ సంద ర్భాలలోని సత్కార అభినందనలు, ప్రముఖులతో ఛాయాచిత్రాలు, కుటుంబ సభ్యుల విశేషాలు, వ్యాసకర్త విశ్లేషణా విమర్శక రచయిత డా॥ సరిపల్లి కృష్ణారెడ్డి వృత్తి, ప్రవృత్తి, రచనల విశేషాలు, ప్రచురణ కర్తలు గ్రంథంలో పొందుపరిచారు.

ప్రతులకు: వేణుశ్రీ
అశ్వినీ ప్రచురణలు
7–1–267, మంకమ్మ తోట
సెల్: 9441440795

–జయసూర్య
సెల్:9014948336

నానీలు

విభేదాలు
తొలగిపోతాయి కొన్నాళ్ళకు
సంబంధాలు
తెగిపోవు ఎన్నటికీ!

రాతిబొమ్మకు
పట్టు వస్త్రాలు
ప్రాణం ఉన్న పేదలకి
చిరుగు వస్త్రాలు.

వాస్తు పండితులు
దిక్కులు చూస్తున్నారు
భూ భ్రమణంతో
దిక్కులు తెలియక.

నేలను నమ్ముకున్న
వ్యవసాయ దారుడికి
ప్రాణాధారం
వానలే.

ఆకాశ పందిరికి
చిల్లులు పడ్డాయా?
కుంభవృష్టి
కురిసింది!

అమ్మాయి
అత్తిరింటి కెళ్ళింది
చుట్టంగా వచ్చింది
పుట్టింటికి.

అనురాగం
జీవనరాగమైతే
జీవితమంతా
తేనెజల్లులే!

ముద్దబంతి
పొత్తు పొడుపు
అందాలు ఆరేసుకుంటాయి
వేటి అందం వాటిదే!

సిరిమల్లె పువ్వు
చిన్నదే అయినా
దాని సింగారం–సువాసన
అమోఘం.

– బొబ్బిలి జోసెఫ్
సెల్: 9989261991

పె(గ)ద్దమనిషి

పె(గ)ద్దమనిషి నిష్క్రమించారు
దహన సంస్కారాన్కి ఏర్పాట్లు చేశారు
కుటుంబంతో
అభిమానజనం కూడా హాజరు
నిప్పుపెడ్తునే
మోపులు మోపులుగా
గంధం చెక్కలు పేర్చారు
ద(గ)బ్బు పనుల వాసనలు
వ్యాపించకుండా
కుట్రలు రచించారు

–కోటం చంద్రశేఖర్
9492043348

విభిన్న సంస్కృతుల నాగరికతల మధ్య అవగాహన సారథి పర్యాటక రంగం

మానవుడు ఉరుకుల పరుగుల జీవితంలో సతమౌతున్న హైటెక్ యుగంలో తీరిక లేక పోటీ పోలికల ఒత్తిడి విషవలయంలో చిక్కుకున్న ఆధునిక మానవునికి మానసిక ఉల్లాసం ఉత్సాహం కలిగించి విశ్రాంతిగా జీవితం హుషారుగా ఆనందంగా గడుపడానికి ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించు కోవడానికి పర్యాటక రంగం దోహదపడుతుంది.

పర్యాటక రంగం ప్రపంచ వ్యాప్తంగా శీఘ్రంగా విస్తరిస్తుంది.

పర్యాటకం విషయ పరిజ్ఞానం

వెయ్యి సార్లు వినడం కన్నా ఒక్క వాక్యం చదవడం మేలు. వెయ్యి వాక్యాలు చదవడం కన్న ఒక్క సారి చూడడం మేలు అనే లోకోక్తి పర్యాటక రంగంలో అక్షర సత్యం. యాత్రల వలన ఎంతో అనుభవం విజ్ఞానం వస్తుంది అనేది నిర్వివాదంశం. పర్యాటకం వల్ల విషయ పరిజ్ఞానం లభిస్తుంది.

ప్రపంచీకరణ పర్యాటక రంగం

ప్రపంచీకరణ 'కార్పొరేటీకరణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అభివృద్ధి చెందడం వల్ల టూరిజం బహు ముఖంగా విస్తరిస్తుంది. సమకాలీన సమాజంలో చోటు చేసుకుంటున్న పలు మార్పులు పరిస్థితులు ఒత్తిడి నుండి ఉపశమనం పొందటానికి, విముక్తి కోసం ఆనందం కోసం కుటుంబ సభ్యులతో స్నేహితులతో ప్రకృతి సందర్శన నూతన ప్రదేశాలను చారిత్రిక కట్టడాలను సందర్శించడం అత్యంత ఆదరణ పొందింది.

వేసవి సెలవుల్లో విద్యార్థులు చారిత్రిక కట్టడాలు ప్రకృతి అందాలు చూడడానికి నూతన ప్రదేశాలకు విజ్ఞాన విహార యాత్రలకు వెళుతుంటారు.

పర్యాటక రంగం – ప్రాధాన్యత

ప్రపంచాన్ని ఒకచోట చేర్చే సామర్థ్యం పర్యాటక రంగానికి వుంది. అంతర్జాతీయ రంగములో ఈ రంగం ప్రమేయం అనేక అంశాలలో సానుకూల వృద్ధిని పెంపొందిస్తుంది. దేశ ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనలో టూరిజం ప్రధాన పాత్ర పోషిస్తుంది. టూరిజం శ్రమ సాంద్రత స్వభావంకలిగి వుంటుంది దాని వల్ల ఉపాధి పై గుణకార ప్రభావం వుంటుంది. దాని వల్ల ఉపాధికి ప్రధాన వనరుగా వుంటుంది . పర్యాటక రంగంలో ఒక ఉద్యోగం కల్పిస్తే పర్యాటక సంబంధిత ఆర్థిక వ్యవస్థలో ఒకటిన్నర అదనపు లేదా పరోక్ష ఉద్యోగాలను సృష్టిస్తుంది ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగాలు సృష్టించే 10 రంగాలలో పర్యాటక రంగం ప్రధాన పాత్రపోషిస్తుంది. ప్రపంచ దేశాల మధ్య శాంతి 'సామరస్యం' భౌగోళిక సమగ్రత, సౌభ్రాతత్వాన్ని, మెరుగైన దౌత్య సంబంధాలను బలోపేతం చేయడానికి పర్యాటక రంగం బహుముఖ పాత్ర

పోషిస్తుంది. సంస్కృతి చరిత్ర విషయములో పర్యాటకరంగాన్ని ప్రోత్సహించడం కంటె సంరక్షణ చర్యల మీద ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి.

పర్యాటక రంగం – ఆర్థికాభివృద్ధి

అభివృద్ధి చెందిన అభివృధి చెందుతున్న దేశాలలో పర్యాటక రంగం శీఘ్రంగా విస్తరిస్తుంది. మంచి రాబడులతో పర్యటక రంగం రోజు రోజుకు అభివృద్ధి చెందుతూ "పరిశ్రమగా" వర్ధిల్లుతుంది. మన దేశములో పర్యాటక రంగం గణనీయమైన ప్రగతిని సాధించింది . స్వదేశీ' విదేశీ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడములో పర్యాటక రంగం బహుముఖ పాత్ర పోషిస్తుంది. దేశములో శీఘ్రంగా విస్తరిస్తున్న సేవా రంగములో పర్యాటక రంగం ప్రథమ స్థానం దక్కించుకోవడం గమనార్హం. పర్యాటకరంగం వివిధ దేశాల సంస్కృతు లు, నాగరికతలు ఆచారాలు, సంప్రదాయాలు, శీతోష్ణ స్థితుల మధ్య అవగాహనకు సయోధ్యకు పర్యాటక సౌభ్రాతృత్వ సారథిగా పనిచేస్తూంది. ఆర్థిక వ్యవస్థలో ఆదాయాన్ని సమకూరుస్తూ దేశ ఆర్థికాభివృద్ధి సాధనలో టూరిజం కీలక పాత్రను పోషిస్తుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పర్యాటకరంగం సుస్థిరాభివృద్ధి సాధనలో చోదక శక్తిగా పనిచేస్తుంది. (కీలక పాత్ర పోషిస్తుంది.) కరోనా వల్ల ఆర్థిక వ్యవస్థ కొంత తిరోగమించి నప్పటికి టూరిజం ప్రపంచదేశాల "జి.డి.పి.కి" ఉత్పేరకంగా పనిచేస్తుంది. ఎంతో మందికి ప్రత్యక్షంగా 'పరోక్షంగా ఉపాధి కల్పిస్తుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అసమానతలు తొలగించడానికి గ్రామీణ ప్రాంతాలలో టూరిజం దోహదపడుతుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు ఉపాధి కల్పనకు గ్రామీణ పర్యాటక రంగం తోడుపడుతుంది. ప్రభుత్వం పర్యాటక రంగానికి "ఎగుమతుల పరిశ్రమ ప్రతిపత్తి" స్థాయిని కలిపించింది. మౌలిక వసతులు పెద్ద స్థాయిలో సమకూర్చడం వల్ల 2020లో వార్షిక దేశస్థూల జాతీయ ఉత్పత్తిలో పర్యాటక రంగం వాటా 7 శాతంపైగా పెరిగింది. 8.5 లక్షల కొట్ల వాట కలిగి ఉందని అంచనాలు తెలుపుతున్నాయి. భౌగోళిక పర్యాటక రంగం మనిషికి ప్రకృతికి మధ్య విభిన్న సంస్కృతులు విభిన్న సృజనాత్మకతకు మధ్య సమన్వయాన్ని సాదిస్తు మానవ జాతి ఔన్నత్యాన్ని చరిత్రను మానవుని శాస్త్ర సాంకేతిక నైపుణ్యాన్ని అవగాహన చేసుకోవడానికి పర్యాటక రంగం దోహదపడుతుంది. విభిన్న ప్రదేశాలు పర్యావరణం ప్రకృతి ప్రజల సంస్కృతి భాష ఆహారపు అలవాట్లు వస్త్రధారణ వంటి విషయాలలో ఉన్న వైవిధ్యాన్ని అవగాహన చేసుకోవడానికి ఆయా దేశాల సాంస్కృతిక, నాగరికత, చారిత్రిక విషయాలను అందరికీ తెలియచేస్తుంది. ఈ నేపద్యంలో ప్రతి యేటా సెప్టెంబర్ 27 న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని అన్ని దేశాలలో నిర్వహిస్తారు. 2023 వ సంవత్సరం ప్రపంచ పర్యాటక దినోత్సవం థీమ్ ప్రజల కోసం ' గ్రహం కోసం మరియు శేయస్సు కోసం ఆర్థికాభివృద్ధి ఉత్పాదకతను ప్రోత్సహించే మెరుగైన పెట్టుబడులకు ప్రాధాన్యత ఇవ్వడం.

పర్యాటక రంగం వల్ల రాజకీయ 'సాంఘిక 'ఆర్థిక సాంస్కృతిక 'అంశాలపై పడే ప్రభావాల మీద సదస్సులు చర్చలు సమావేశా లు నిర్వహిస్తారు. ఈ రంగం ఆర్థిక వ్యవస్థ మీద చూపే ప్రభావం గురించి చర్చిస్తారు. ఈ సంవత్సరం 'సుస్థిరాభివృద్ధి శ్రేయస్సు కోసం పర్యాటక' (Tourisam for inclusive Growth) అనే థీమ్‌తో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కోవిడ్ బి19 ప్రపంచ వ్యాప్తంగా ప్రతి వ్యవస్థ మీద ప్రభా వం చూపింది. నిరుద్యోగం పేదరికం రాజ్యమేలటం వల్ల అనేక కుటుంబా లు విచ్ఛిన్నమైనా యి. అసంఘటిత రంగం కుదేలై నిరుద్యోగం పెరిగింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గొడ్డలి పెట్టుగా పరిణమించింది. కోవిడ్ మహమ్మారి కారణంగా దేశాల మధ్య రాకపోకలు వర్తక , వాణిజ్య వ్యాపార కార్యకలాపాలు నిలిచిపోయాయి. ప ర్యాటక రంగం ఎక్కువగా దెబ్బతిన్నది.

పర్యాటక రంగాన్ని పూర్వ స్థితికి

> **ప్రపంచాన్ని ఒకచోట చేర్చే సామర్థ్యం పర్యాటక రంగానికి వుంది. అంతర్జాతీయ రంగములో ఈ రంగం ప్రమేయం అనేక అంశాలలో సానుకూల వృద్ధిని పెంపొందిస్తుంది. దేశ ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనలో టూరిజం ప్రధాన పాత్ర పోషిస్తుంది.**

తేవడానికి థీమ్ ను UNO ప్రతిపాదించింది. ప్రపంచ దేశాలు పర్యాటక రంగాన్ని పునరుద్ధరించి ప్రగతి పథంలో ముందుకు కొనసాగించడానికి అవకాశాలు కలిపించాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగింది.

పెరిగిన విదేశీ పర్యాటకులు

ఇటీవల భారతదేశ ప్రభుత్వం "ఇన్ క్రిటిబుల్ ఇండియా "ప్రచారంలో మన దేశం పట్ల ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి పెరిగింది.విదేశీ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది.6 వేల సంవత్సరాల మనదేశ నాగరికత విభిన్న సంస్కృతులు, ఆచారాల, సంప్రదాయాలు, కళారూపాలు, వైవిధ్యభరితమైన జీవనవిధానాలు, సహజ సంపద నదులు, జలపాతాలు, సెలయేర్లు, సహజ వనరులు మనదేశ ప్రజల ఆచార, వ్యవహారాలు, విశ్వాసాలు, అలవాట్లు, పండుగలు, కళలు సాహిత్యం, సంగీతం, నృత్యారీతులు, ప్రాచీన శిల్ప సంపద, విగ్రహాలు, నోరూరించే వంటలు 'వీధి వంటకాలు' ప్రకృతి సౌందర్యాలు 'సాంస్కృతిక ఆస్తులు మన నాగరికత విదేశీ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది.

"శారీరక దారుఢ్యం బలపరచడానికి మానసిక వికాసానికి, సాంస్కృతిక రంగ వికాసానికి సాహితీ రంగ అభివృద్ధికి ఆధ్యాత్మిక, ధార్మిక భావనలు పెంపొందించడానికి పర్యాటక రంగం ఒక చక్కని వేదిక అని కేంద్ర ప్రభుత్వం పర్యాటక రంగం పాలసీలో" పేర్కొంది.

ఆధునిక కాలములో పర్యాటక రంగం అభివృద్ధి చెందడం వల్ల దేశాల మధ్య టూరిస్టులు సంఖ్య గణనీయంగా పెరిగింది. మనదేశంలో, యోగ, ఆయుర్వేదిక్, హోమియోపతి, యూనాని మున్నగు ప్రత్యామ్నాయ వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా టూరిస్టులు వైద్య చికిత్స కోసం మన దేశానికి రావడం వల్ల వైద్య టూరిజం గణనీయంగా పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల నుండి పర్యాటకులు ఇక్కడికి వస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతులు మెరుగుపడడంవల్ల గ్రామీణ ప్రాంతాలలో పర్యాటక ప్రదేశాల సందర్శనకు వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య పెరిగింది.

గ్రామీణ పర్యాటక రంగానికి జాతీయంగ, అంతర్జాతీయంగ గుర

సాహిత్య సుగంధ సమీరుడు పొత్తూరి సుబ్బారావు

'సాహితీకిరణం' మాసపత్రిక సంపాదకులు పొత్తూరి సుబ్బారావు జన్మదినం (సెప్టెంబర్ 28) సందర్భంగా..

'ఏమీలేని ఇస్తరి ఎగిరెగిరి పడుతుంది, అన్నీ ఉన్న ఇస్తరి అణిగిమణిగి ఉంటుంది' అనే సామెత పొత్తూరి సుబ్బారావు విషయంలో అక్షరాలా నిజం అని చెప్పవచ్చు. తన హృదయంలో ఎంత సాహిత్యం దాగివున్నా, ఎంతమందికి పంచి పెడుతున్నా, ఎంత మంది వర్ధమాన రచయితలను తన పత్రిక సాహితీకిరణం ద్వారా సాహితీప్రపంచానికి పరిచయం చేస్తున్నా, వ్యంజకాలు వంటి లఘు కవితారూపానికి శ్రీకారం చుట్టినవారైనా, సభలు నిర్వహించినా, తాను మాత్రం ఒక నిశ్శబ్ద వీణ. తక్కువగా మాట్లాడతారు, సున్నితమైనవారు, నిరాడంబరతనే ఆభరణంగా స్వీకరించారు. చిరకాలం ప్రభుత్వ సమాచార శాఖలో ఉద్యోగించి పదవీ విరమణ చేసినప్పటికీ, పని విరమణ చేయని అలుపెరగని సాహితీ ధనుర్ధారి ఆయన. అందుకే సుబ్బారావుగారి

బండికల్లు వెంకటేశ్వర్లు ట్రస్టు వారి సభలో..

మిత్రులు ఆయన్ని Subba Rao Retired but not Tired' అంటుంటారు.

వ్యక్తిగా ఎంత మృదువైన వారైనా కవిత్వంలో పదునైన వారు. సామాజిక సమస్యలపట్ల ఆయన సునిశితదృష్టి సారించి అనునిత్యం జరిగే సంఘటనలకు ప్రతిస్పందిస్తూ అక్షరాలను కవితలుగా తీర్చిదిద్దుతారు. వస్తు ప్రధాన కవితలు ఆయనవి. వస్తువు లేనప్పుడు కవిత్వం పస్తులుంటుందన్న డా॥ఎన్.గోపిగారి భావనే వారి దృక్పథం. కనిపించని విషయాలనేమీ వారు రాయరు. కనిపించే యదార్థ సంఘటనలే అతని కలం నుండి కవితలై పయనిస్తాయి. సంఘటన ప్రస్తావనలో మచ్చుకు ఒక కవిత చెప్పాలంటే 'బిల్కిస్ బానో సంఘీభావ' కవితలో ఇట్లా అంటారు.

రేపిస్టుల ఘనసత్కారమే
ఎలాగ్గ్గ్గ్గ్
ఆనందదాయకమైతే
రేపటి ప్రమాద
ఘంటికలను గుర్తెరిగి
దిగజారిన సమాజపు
పోకడలకు
అడ్డుకట్ట వేయగలిగే
సత్తువను
మనస్సులోకి, దేహంలోకి
సింజిలతో
ఎక్కించుకోగలగాలి

అవును..... వారి మనసులోని భావాల్ని నిక్కచ్చి గా, సూటిగా చెప్పగలిగే సత్తా వారికుంది. అందుకే ఇలా.....

సర్వసాధారణంగా మానవ భావజాలానికిసైతం అందని ముల్లులా పొడుచుకొచ్చిన ప్రపంచీకరణను నిశితంగా పరిశీలిస్తూ కవిత్వరూపంలో కలాన్ని ఝుళిపిస్తున్న పొత్తూరి వారు సమాజానికి కనువిప్పు కలిగించి, చైతన్యాన్ని రేకెత్తించే భావాలతో కూడిన వాస్తవిక విషయాలెన్నిటినో వెలికి తెచ్చేందుకు తపన పడుతూ ఉంటారు. ఇందుకు నిదర్శనంగా

అసమాన మేధావులుగ
ఖ్యాతి గడించినవారు
'గాట్' ఒడంబడికపై చేసిన
సంతకాలిపుడు
సామాన్యుల హృదయ
ఫలకంపై
గునపాలై గుచ్చుకున్నాయి
'డెంకల్' తెచ్చిన
ప్రతిపాదనలన్నీ
పేదరికపు డొక్కలను
మరింత ఎండగట్టాయి

ఇంత నిశితంగా, నిర్భయంగా ప్రపంచీకరణ విధానాలను ఎండగట్టగలిగిన దిట్ట కవి పొత్తూరి. ఇలా వీరి ప్రతిభా పాటవాలు అనంతం, అమోఘం. మనిషి జీవితం వైయుక్తికమైనా, సామాజికమైనా అది సంక్లిష్టమే, సంఘర్షణాత్మకమే. ఆవేశ జ్వాలలు, ఉద్విగ్న ప్రభంజ నాలుకూడా అనివార్యంగా ఉంటూఉంటాయి. ఈ సందర్భాలను కవిత్వీకరించేటప్పుడు అది తుఫానై విరుచుకు పడుతుందా? మహోగ్రిగా ప్రజ్వరిల్లుతుందా? కన్నీరై కరళ్ళెత్తుతుందా? అనేది వీరి కవితాశైలి విధానంలో అక్కడక్కడా మరో కోణం మనకు కనపడుతుంది.

బాల్యం-విద్యాభ్యాసం:

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు పట్టణం సాహిత్యానికి పట్టుగొమ్మ వంటిది. ఎందరో సాహితీవేత్తలు గుంటూరు నగరమైతేనేమి, జిల్లాలోనైతేనేమి పుట్టి విశ్వఖ్యాతిని గడించారు. అందులో మహాకవి జాషువా ఒకరు. ఆయన సెప్టెంబర్ 28, 1895లో జన్మించి విశ్వసరుడిగా పిలవబడ్డాడు. ఆయన మహోన్నతమైన కావ్యాలు రచించాడు. సరిగ్గా అదే తేది అంటే సెప్టెంబర్ 28న, కానీ సంవత్సరం మటుకు 1949లో గుంటూరు పట్టణంలో మరో సాహితీ ధనుర్ధారి జన్మించారు. అయనే పొత్తూరి సుబ్బారావు. పొత్తూరి అనగా వెంటనే చాలామందికి ప్రముఖ పాత్రికేయులు పొత్తూరి వెంకటేశ్వరరావు గుర్తుకొస్తారు. ఆయనకి స్వయానా అన్నగారి కుమారుడే పొత్తూరి సుబ్బారావు. పొత్తూరి సుబ్బరామయ్య, అన్నపూర్ణమ్మలకు 5వ సంతానంగా సుబ్బారావు జన్మించారు. జీవించి ఉన్నవారిలో వారికి ముగ్గురు అక్కయ్యలు, ముగ్గురు తమ్ముళ్ళు. సుబ్బారావు తండ్రి సుబ్బరామయ్య అప్పటి ఆంధ్రరాష్ట్ర రెవెన్యూ శాఖలో క్లార్క్‌గా గుంటూరులో ఉద్యోగించేవారు. తరువాత ఆయన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా మంగళగిరికి బదిలీ అవటం జరిగింది. అక్కడే సుబ్బారావు అక్షరాభ్యాసం జరిగింది. మంగళగిరికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. కూచిపూడి నాట్యాచార్యులు గిరిజా కల్యాణం సంగీత నృత్యరూపకంలో మంగళాద్రి నారసింహ ప్రశస్తి ఉన్నది. అటువంటి మహత్తరమైన స్థలంలో విద్యాభ్యాసం చేయటమో ఏమో కానీ భవిష్యత్తులో అతను ఒక సాహితీవేత్తగా కీర్తి గడించాడు. ఒకటవ తరగతినుండి నాలుగవ తరగతి వరకు మంగళగిరి శారదా విద్యాలయంలో చదివి, ఆ తరువాత తండ్రికి తిరిగి గుంటూరుకు బదిలీ కావటంతో ఐదవ తరగతి గుంటూరు పాండురంగ విద్యాలయం పాఠశాలలో చదవటం జరిగింది. 1956 నవంబర్ ఒకటిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడటంతో 1958లో పొత్తూరి సుబ్బరామయ్యగారిని హైదరాబాద్‌కి బదిలీ చేయటం జరిగింది. అప్పటినుండి అనగా 6వ తరగతినుండి 12వ తరగతి (మల్టీపర్పస్ హైచ్.ఎస్.సి)వరకు హైదరాబాద్ చిక్కడపల్లి ఆంధ్రవిద్యాలయంలోను, హైదరాబాద్ దోమలగూడ ఆంధ్రవిద్యాలయంలోను సుబ్బారావు పాఠశాల విద్యాభ్యాసం గడిచింది.

ఆ తదుపరి నానక్‌రామ్ భగవన్‌దాస్ సైన్స్ కళాశాలలో బి.ఎస్సీలో

'పిచ్చుక గూడు' సంపుటి ఆవిష్కరణలో..

చేరటంతో సుబ్బారావులో సాహిత్యంతో అనుబంధం అలవడింది. ఆ కళాశాలలో అధ్యాపకుడిగా ఉన్న శశాంక (వి.వి.సుబ్బారావు) స్వతహాగా కవి కావటంతోనూ, కళాశాల ప్రిన్సిపాల్ సి.వి.రామకృష్ణారావు ఆంగ్లోపన్యాసకులు అయినప్పటికీ తెలుగు సాహిత్యంమీద అభిమానం ఉండటంతోనూ కళాశాలలో కవి సమ్మేళనాలు, అష్టావధానాలు ఏర్పాటు చేసేవారు. సుబ్బారావు తప్పకుండా ఆ సాహిత్య కార్యక్రమాలకి ఎంత పొద్దుపోయినా హాజరవుతూ వుండేవారు. కళాశాలలో ఒకసారి కవిసమ్మేళనం జరుగుతుండగా ఒక విద్యార్థి వియత్నాంపై అమెరికా దాడిని అంశంగా తీసుకొని ఒక కవిత రాసి వినిపించారు. ఆ యుద్ధసమయంలో అమెరికా సైనికులు మిస్ ఇండియాని ముద్దుపెట్టుకోవటము, అందుకు భారతదేశప్రతిష్ఠ దిగజారిందని తెలపడం ఆ కవిత సారాంశం. ఆ కవిత విన్న వెంటనే తానూ కవితలు ఎందుకు రాయకూడదు అనే ఉద్దేశ్యంతో సుబ్బారావు బంగ్లాదేశ్ విమోచన, బంగ్లాదేశీయులు భారతదేశానికి వలస రావటాన్ని దృష్టిలో పెట్టుకొని 'తావులేదు' అనే ఒక కవిత రచించారు. అదే సుబ్బారావు రచించిన మొదటి కవిత. అప్పుడు విద్యార్థి మిత్రులు కొందరు సాధారణంగా ఎవరైనా తొలి కవితను ప్రేమ కవితగా రాస్తారు కానీ, నువ్వేంటీ! ఈ కవిత రాశావు అని ప్రశ్నించారు. అయితే అప్పటికే సుబ్బారావు దృష్టంతా ప్రపంచంలో జరిగిన పరిణామాలపైనే ఉండేది. ఆ కవిత కళాశాల మ్యాగజైన్‌లో ప్రచురించటం జరిగింది. అప్పటినుండి అడపాదడపా చిన్న చిన్న కవితలు రాస్తుండేవారు.

వారి కాలేజీ లైబ్రరీలో ఎన్నో మంచి పుస్తకాలుండేవి. వీరు చదివిన నవలల్లో ఈయనకి బాగా నచ్చిన నవలలు మూడు. మొదటిది బుచ్చిబాబు రచించిన 'చివరకు మిగిలేది', రెండవది కొమ్మూరి వేణుగోపాలరావు రచించిన 'పెంకుటిల్లు' నవల, మూడవది శీలావీర్రాజు రచించిన 'మైనా' అనే నవల. విశేషమేమిటంటే ఆ మైనా నవల రచించిన శీలా వీర్రాజు,సమాచార శాఖలో పనిచేస్తున్న వారని అక్కడ ఉద్యోగంలో చేరినప్పుడు తెలిసింది. అదే సమయంలో వారి ఇంటివద్దకూడా కొంతవరకు సాహిత్య వాతావరణం ఉండేది. సుబ్బారావు గారి తండ్రి పొత్తూరి సుబ్బరామయ్య ఎమెస్కో పుస్తకాలు కొనుక్కొస్తుండేవారు. అందులో విశ్వనాథ సత్యనారాయణ నవలలు ఎక్కువగా ఉండేవి. సుబ్బారావు శ్రీశ్రీ అభిమాని అయినప్పటికీ విశ్వనాథ నవలలనే ఎక్కువగా చదివినట్టు వారు చెపుతుంటారు. ఇంకా చిలకమర్తి, పానుగంటివారి సాహిత్యంకూడా ఎక్కువగా చదవటంతో వారి దారి సాహిత్యం వైపు మళ్ళటానికి మరింత దోహదం చేసింది.

ఉద్యోగపయనం:

వీరు 1974 జూన్ 24వ తేదీన సమాచార పౌరసంబంధాల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. అదే ఆఫీసులో వచన కవితాపితామహుడు కుందుర్తి ఆంజనేయులు, కవి-రచయిత-చిత్రకారుడు శీలా వీర్రాజు పనిచేస్తుండటంతో, వారితో ఏర్పడిన పరిచయంతో సుబ్బారావులోవున్న సృజనాత్మకత మరింత పెరిగింది. సమాచార శాఖలో ప్రకటనలు, ప్రెస్ విభాగాలలో పనిచేయటంవల్ల పత్రికలవారితో పరిచయాలు ఏర్పడటంతో, వారినుండి అందిన మరింత ప్రోత్సాహంతో వీరు వ్రాసిన కవితలు పత్రికలలో ప్రచురించబడడం జరుగుతుండేది. కళాశాల మ్యాగజైను, ఆఫీసు మ్యాగజైనులే కాకుండా బయట పత్రికలలో కవిత ప్రచురించబడటం అనేది మొట్టమొదటి సారిగా విశాలాంధ్ర దినపత్రికలో. ఆ తదుపరి కృష్ణాపత్రిక, ఆ తరువాత నేటినిజం పత్రికలో ఎక్కువగా కవితలు ప్రచురించబడ్డాయి. ఇంకా ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ దినపత్రికలలోకూడా ప్రచురింపబడ్డాయి. అదే సమయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుబ్బారావు పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరు కావాలనే తలంపుతో ఆంధ్రప్రదేశ్ ఓపెన్ యూనివర్శిటీలో పి.జి. డిప్లొమా ఇన్ పబ్లిక్ రిలేషన్స్ చేయటం జరిగింది. దానితో పత్రికలకు వ్యాసాలు ఎలా రాయాలో, ప్రెస్ నోట్లు ఎట్లా రాయాలో అనే విషయాలలో సుబ్బారావు మెళకువలను తెలుసుకోగలిగారు. అప్పటినుండి అప్పుడప్పుడు వ్యాసాలు, ఎక్కువగా కవితలు రాస్తుండేవారు. ఒకసారి నేటినిజం సంపాదకులు బైసదేవదాసు సమాచార శాఖ ఆఫీసుకు వచ్చినప్పుడు మీరు వ్యాసాలు ఎందుకు రాయకూడదూ అనటమూ, తరువాత మరోసారి కథలెందుకు రాయకూడదూ అనటంతో వాటిపై సుబ్బారావు మక్కువను పెంచుకోవటంతో కవిగానేకాకుండా, రచయితగా కూడా పేరుపొందారు. 2007 సెప్టెంబర్ 30వ తేదీన పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా సుబ్బారావు తన రిటైర్‌మెంట్‌కుముందే 'పిచ్చుకగూడు' అనే కవితాసంపుటిని ప్రచురించారు. ఆ పుస్తకానికి విశ్వసాహితీవారు ఉత్తమ కవితాసంపుటిగా పురస్కారాన్నందించారు.

సాహిత్య కుటీరం:

1975 ఆగస్టు 10న సుబ్బారావుకి పింగళి కుటుంబం నుంచి వచ్చిన జయలక్ష్మితో వివాహం జరిగింది. ఆమె తల్లిదండ్రులు పింగళి రామగోపాలరావు, లక్ష్మీ నరసమ్మ. వారికి ఆమె 5వ సంతానంగా జన్మించారు. ఆమె సోదరులు పింగళి వెంకటకృష్ణారావు, పింగళి జగన్నాధరావు. ఇరువురూ స్వతహాగా కవి, పండితులు కావటంతో జయలక్ష్మికూడా కథలు రాయటంతోనూ పొత్తూరి సుబ్బారావు గృహం ఒక సాహిత్యకుటీరంగా మారింది. వారికి ఒక ఆడపిల్ల, ఒక మగపిల్లవాడు సంతానం.

సుబ్బారావు కుమార్తె పావనిశ్రీకి పోచిరాజు వెంకట కొండారావుతో వివాహం జరిగింది. వారు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో జూనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. వారికి ఒక కుమార్తె, ఒక కుమారుడు. వారి కుమార్తెకూడా హిందీ, ఆంగ్ల భాషల్లో కవితలు రాస్తుంటుంటుంది. ఇప్పుడు వీరు మెదక్ జిల్లాలోని ఎద్దుమైలారంలో నివాసం ఉంటున్నారు.

సుబ్బారావు కుమారుడు హిమకిరణ్ బెంగుళూరులోని ఒక పరిశోధనా సంస్థలో సైంటిస్ట్‌గా చేస్తున్నారు. అతనుకూడా అప్పుడప్పుడు కవితలు రాస్తుంటాడు. అతనికి బండారు శైలజతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమార్తెలు. వారి పెద్దకుమార్తెకూడా కవితలు, కథలు రాస్తుంటుంది.

రచనల గుచ్ఛము:

సుబ్బారావు రిటైరయిన తరువాత 'పుడమితల్లికి సంకెళ్ళు', 'మనోహర దృశ్యం' వంటి కవితాసంపుటాలు రచించారు. సుబ్బారావు సాహిత్యాన్ని గుర్తించి మచిలీపట్టణం ఆంధ్రసాహిత్య సమితివారు ఉగాది పురస్కారాన్ని అందించారు. అదో ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం. 2013లో 'హృదయ వేదన వనంలో' కవితాసంపుటి, 2014లో 'తొలికిరణాలు' సాహితీకిరణం సంపాదకీయాల సంపుటి, 2015లో 'సంస్మర్తలొస్తున్నారు జాగ్రత్త' కథాసంపుటి, 'కొత్త పొద్దుపొడుపుకోసం' కవితాసంపుటి, 2016లో 'వారితీరే వేరు' వ్యంజకాల సంపుటి, 2018లో 'స్తబ్దత నుండి సమరవైపు' కవితా సంపుటి, 2022లో 'అక్షరం అమృతం' వ్యాససంపుటి, 2022లో 'సుమ సోయగాలు' పేరుతో పూర్తిగా పూలమీదనే 50 కవితలతో ఒక కవితాసంపుటి రచించారు. ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. ఎప్పుడో జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు 'పుష్పవిలాపం' అనే పద్యాల్ని రచిస్తే, ప్రస్తుతం సుబ్బారావుగారు పూర్తిగా పూలపైననే రచించిన 'సుమ సోయగాలు' వచన కవితాసంపుటి తెలుగు సాహిత్య చరిత్రలో ప్రథమ స్థానంలో నిలుస్తుంది అని చెప్పవచ్చు. అష్టాక్షరి అనే మానవపత్రికలో ప్రతిమాసం పూలమీద ఒక కవిత రాస్తున్న విషయాన్ని కడియంలోని ఒక ఉపాధ్యాయ కవి చిలుకూరి శ్రీనివాసరావు తెలుసుకోవటంతో ఆయన కోరిక మేరకు ఈ కవితానంపుటిని డా॥వైయస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ టి.జానకిరామ్‌గారు కడియంలో ఆవిష్కరించడం జరిగింది. ఆ సందర్భంలో ఆ పుస్తకంలోని కవితలన్నీ విశ్వవిద్యాలయ విద్యార్థులందరికీ అందుబాటులో ఉండేటట్లుగా ఈ పుస్తకాన్ని విశ్వవిద్యాలయ గ్రంథాలయాలలో ఉంచుతామని తెలియజేయడం 'సుమ సోయగాలు' కవిత్వానికి వచ్చిన ప్రత్యేక ఆదరణ అని చెప్పవచ్చు. ఈ కవితాసంపుటిని కడియంలోని నర్సరీల పితామహుడుగా ఖ్యాతి గడించిన పల్ల వెంకన్నకి అంకితం కావించడం మరో విశేషం. సుమసోయగాలను మన స్ఫూర్తిగా తాననుభూతి చెందుతూ పరితలకుకూడా ఆ అనుభూతిని పంచుతూ అందించిన హృదయోల్లాసపు విందు అని డా॥కె.వి.రమణాచారి గారు ఈ పుస్తకం ముందుమాటలో తెలియజేయటం విశేషం. ఆ పుస్తకంతో సుబ్బారావుగారు 'సాహిత్య సుగంధ సమీరుడు'గా పేరు గడించారు. సుబ్బారావుగారి పుస్తకాలన్నీ ఎక్కువగా హైదరాబాద్‌లో డా॥కె.వి.రమణాచారిగారిచే ఆవిష్కరించబడ్డాయి. సుబ్బారావుగారు ఉద్యోగంలో ఉన్నప్పుడు డా॥కె.వి.రమణాచారి సాహిత్యపరంగా ఇచ్చిన ప్రోత్సాహ ఫలితమే ఇది అనిచెప్పవచ్చు. 'రాళ్ళూ చిగురిస్తాయి' అనే మరో కవితాసంపుటి అక్టోబర్ 20న త్యాగరాయ గానసభ కళాసుబ్బారావు కళావేదికలో జి.వి.ఆర్.ఆరాధన సంస్థద్వారా ఆవిష్కరించబ డబోతున్నది. ఆ సభలో నేటినిజం సంపాదకులు బైసదేవదాసుకూడా పాల్గొంటారు. ఈ కవితాసంపుటికూడా డా॥కె.వి.రమణాచారిగారి చేతుల మీదుగానే ఆవిష్కరించబడుతుంది.

'అక్షరం అమృతం' ఆవిష్కరణలో..

ఆకాశవాణితో అనుబంధం:

ఒకవైపు రచనలు చేస్తూనే పొత్తూరి సుబ్బారావు ఆకాశవాణితో అనుబంధాన్ని ఏర్పరచుకున్నారు. భావన కార్యక్రమంలో వారు రచించిన అనేక లఘు ప్రసంగాలు ప్రసారమయ్యాయి. స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవాలు సందర్భంగా స్వాతంత్ర్యోద్యమంలో తెలుగువారు అనే అంశంమీద 45 నిమిషాలసేపు ఆయన ప్రసంగం అద్భుతంగా సాగింది. కొన్ని పుస్తకాలను ఆకాశవాణి ద్వారా సమీక్ష చేయటం కూడా జరిగింది. ఆకాశవాణితో వారికున్న అనుబంధం నేటికీ కొనసాగుతూనే వున్నది. ఇతర ప్రైవేటు రేడియోలలో (టోరీ) కూడా వారి ప్రసంగాలు, కవితలు ప్రసారమయ్యాయి.

ఎలక్ట్రానిక్ మీడియా:

అలాగే దూరదర్శన్‌లోకూడా వారు చేసిన పుస్తకసమీక్షలు, వారి ఇంటర్వ్యూ ప్రసారమయ్యాయి. విస్సా, ఛానల్ 16, వి3, నాయుడు వంటి ప్రైవేటు ఛానల్స్, యూట్యూబ్‌లలో కూడా కవితలు, ప్రసంగాలు, వారి ఇంటర్వ్యూలు ప్రసారమయ్యాయి.

అవధానాలతో అనుబంధం:

వామపక్ష భావాలున్న పొత్తూరి సుబ్బారావు ఒకవైపు రచనలు చేస్తూనే అనేక అవధాన కార్యక్రమాలలో పాల్గొన్నారు. మాడుగుల నాగఫణి శర్మ, మేడసాని మోహన్‌ల పంచశతావధానంలోనూ, వద్దిపర్తి పద్మాకర్ అష్టావధానాలలో అనేక పర్యాయాలు పృచ్ఛకుడుగా పాల్గొన్నారు. ఇవన్నీ ఒక ఎత్తైతే 2017లో హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచతెలుగు మహాసభలలో రామ శర్మ శతావధానంలో పృచ్ఛకుడుగా (వర్ణన)లో పాల్గొనటం, అదే రోజు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుగారు ఆ సభకు రావటం, వేదికమీద ఉన్న అవధానిని, పృచ్ఛకుల నందరినీ ప్రశంసించటం జరిగింది.

సాహితీకిరణం ప్రకాశనం:

పొత్తూరి సుబ్బారావు ఉద్యోగవిరమణ తరువాత రవితేజం అనే దినపత్రికలో సాహిత్యానికి సంబంధించి ప్రతిమాసం వెలువడే సాహితీతేజానికి ఎడిటర్‌గా పనిచేసి, ఎందరో వర్ధమాన రచయితలను పరిచయం చేశారు. ఆ తదుపరి 2009 మార్చిలో స్వయంగా 'సాహితీకిరణం' అనే మాసపత్రికను స్థాపించటం జరిగింది. ఆ పత్రికకు తాను ఎడిటర్‌గానూ, వారి శ్రీమతి జయలక్ష్మి మేనేజర్‌గానూ వ్యవహరిస్తూ, గుదిబండి వెంకటరెడ్డి గౌరవ సంపాదకులుగానూ, తూములూరి రాజేంద్రప్రసాద్, పెద్దూరి వెంకటదాసు, విడదల సాంబశివరావు, వి.వి.రాఘవరెడ్డి నలహోదారులుగానూ వ్యవహరించటం జరుగుతున్నది. ఈ పత్రిక దినదినాభివృద్ధి చెందుతూ దిగ్విజయంగా 14 సంవత్సరాలు పూర్తిచేసుకొని 15వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఈ మాసపత్రిక ద్వారా వర్ధమాన రచయితలను, కవులను, ప్రోత్సహించటం జరుగుతున్నది. అటువంటి వర్ధమాన రచయితలు తరువాత తరువాత కొన్ని పెద్దపెద్ద పత్రికలలోకూడా రచనలు చేయటం జరుగుతున్నది. అట్లాగే ప్రవర్ధమాన కవులు, రచయితలైనటువంటి డా॥సి.నారాయణరెడ్డి, డా॥ఎన్.గోపి, డా॥వోలేటి పార్వతీశరం, ఆచార్య కొలకలూరి ఇనాక్, డా॥అంపశయ్య నవీన్ వంటి అనేకమంది రచనలు సాహితీకిరణంలో ప్రచురించబడ్డాయి, ప్రచురించబడుతున్నాయి. ప్రముఖులైనటువంటి డా॥అక్కినేని నాగేశ్వరరావు, డా॥పాలకుర్తి మధుసూదనరావు, డా॥ఎన్.గోపి, ఆచార్య కొలకలూరి ఇనాక్, జర్నలిస్టులైన డా॥పొత్తూరి వెంకటేశ్వరరావు, బైసదేవదాసు, అభినందన భవాని, డా॥వంశీ రామరాజు, డా॥శోభానాయుడు, మండలి బుద్ధప్రసాద్, డా॥లక్ష్మీ పార్వతి, అక్కిరాజు సుందరరామకృష్ణ, అయ్యదేవర పురుషోత్తమరావు, డా॥వై.రామకృష్ణారావు,సినీనటులు రంగనాథ్, డబ్బింగ్ జానకి వంటి అనేకమంది ఇంటర్వ్యూలు సాహితీకిరణంలో ప్రచురించబడ్డాయి. సాహితీకిరణంలో ఎంతోమంది లబ్ధప్రతిష్ఠులైన రచయితలు, ఇతర ప్రముఖులపై రాసిన వ్యాసాలుకూడా ప్రచురించబడుతున్నాయి. ఈ పత్రిక ద్వారా పలు సంస్థల సౌజన్యంతో కథలు, కవితలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి ఎందరికో బహుమతులు, ఇతరత్రా పురస్కారాలు ఇస్తున్నది. సాహితీకిరణం ఇలా ఎంతో సాహితీ సేవ చేస్తూనే వున్నది.



'పుడమితల్లి' సంపుటి ఆవిష్కరణలో..

కొత్త కవితారూపం 'వ్యంజకాలు':

సాహితీకిరణాన్ని దిగ్విజయంగా నడుపుతూనే 2010లో గుంటూరు చిలకలూరిపేటలో నిర్వహించిన కవిసమ్మేళనంలో 'వ్యంజకాలు' అనే కొత్త కవితారూపాన్ని ప్రవేశపెట్టి కొన్ని వ్యంజకాలను చదివి వినిపించారు. ఈ లఘు కవితారూపానికి ప్రేరణ వేమన కవి. వీరికి మొదటినుండీ కవి వేమన అంటే అభిమానం ఎక్కువ. వేమన శతకం అంతాకూడా వారు ఎన్నో సార్లు చదివారట. అందులో వారికి బాగా నచ్చింది

వేడివండు చూడ
మేలిమైయుండును
పొట్టవిచ్చి చూడ పురుగులుండు

అనే పద్యం. ఈ పద్యంలోని రెండు పాదాలలో ఒకటి అనుకూలం, మరొకటి ప్రతికూలంగా ఉండటంతో ఆ రెండు పాదాలే వ్యంజకాలు అనే నూతన కవితారూపానికి స్ఫూర్తిని చ్చాయి అంటారు సుబ్బారావుగారు. ఈ వ్యంజకాల గురించి గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్యకు విశదీకరించి, అక్కడ చదవటంతో మంచి స్పందన లభించింది. 2010 జూన్ సాహితీకిరణం మాసపత్రికనుండి వ్యంజకాలను ప్రతినెలా ప్రచురించడం ప్రారంభించడంతో అనేకమంది కవులు వ్యంజకాల రచనకు ఉపక్రమించారు. నాటినుండి నేటిదాకా దాదాపు 150 మంది కవులు, కవయిత్రులు సాహితీకిరణం, మరికొన్ని ఇతర పత్రికల్లోనూ వ్యంజకాలు రాశారు. కేతవరపు రాజ్యశ్రీ తొలిసారిగా 'బొమ్మ-బొరుసు' పేరుతో వ్యంజకాల సంపుటిని వెలువరించి దాన్ని వారికే అంకితం కావించారు. తరువాత నాగాస్త్రీ, సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు, కడలి ప్రకాశరావు, డా॥తూములూరి పార్థసారథి, యం.బాలగంగాధరయ్య, వ్యంజకాల సంపుటులను వెలువరించారు. కరీంనగర్‌కి చెందిన రచయిత డా॥వైరాగ్యం ప్రభాకర్ 80 మంది కవులు ఒక్కొక్కరు 6 వ్యంజకాలు చొప్పున రాసిన వ్యంజకాలతో 'వ్యంజక రత్నాలు' పేరుతో పుస్తకాన్ని వెలువరించారు. సుబ్బా రావు గారు రచించిన వ్యంజకాల సంపుటి 'వారి తీరే వేరు'ని డా॥కె.వి.రమణాచారి గారికి అంకితం కావించారు. ఆ వ్యంజకాలలో మచ్చుకు.....

బడిబాటంటూ ప్రచారానికి
బయలుదేరింది బడిపిల్లల
ఊరేగింపు
అదేమిటో అర్థంకాక
ఆశ్చర్యంగా చూస్తున్నారు
వీధిబాలలు

ఆ దంపతులిద్దరిదీ
ఒకే మాట, ఒకే బాట
న్యాయస్థానం నుండి
విడాకులు పొందేందుకు

చట్టసభల్లో ఎన్నాళ్ళకో
ఏకాభిప్రాయం కుదిరింది
సభ్యులందరూ
తమ జీతాల్ని పెంచుకోవడానికి

ఈ 'వ్యంజకాలు' ప్రక్రియపై కొందరు విశ్వవిద్యాలయ స్థాయికి వెళ్ళి డాక్టరేట్ చేయటం జరిగింది. వారిలో సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు డాక్టరేట్ అందుకున్నారు. వైరాగ్యం ప్రభాకర్ వ్యంజకాలపై విశ్వవిద్యాలయంలో పత్రసమర్పణ కావించారు.

పురస్కారాలు:

ఆంధ్రసారస్వత సమితి ఉగాది పురస్కారం,ఎక్స్‌రే పురస్కారం 'సంతకం ఓ ప్రభంజనం' కవితకు, కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు స్మారక 'విశ్వదాత' పురస్కారం, దుగ్గిరాల సోమేశ్వరరావు రంగస్థల పురస్కారం,వంశీ గరుడవేగ పురస్కారం, విశాఖ సమాచారం వారి ఉగాది పురస్కారం, కీ॥శే॥పోసాన శేషగిరిరావు స్మారక రంగస్థల పాత్రికేయ పురస్కారం, జి.వి.ఆర్.ఆరాధన ద్విదశాబ్ది కవితాపురస్కారం, సహజ సాహితి చీరాల పత్రికానిర్వహణ పురస్కారం, వై.యస్.ఆర్. ఛారిటబుల్ ట్రస్ట్ సాహిత్య పురస్కారం, స్వర్ణపుష్పం మాసపత్రిక అమృతమూర్తి పురస్కారం, జ్యోత్స్న కళాపీఠంవారి ఉగాది పురస్కారం, జి.వి.ఆర్.నెలకొల్పిన డా॥కె.వి.రమణ ఎక్స్‌లెన్సీ అవార్డు, అభినందన ఎక్స్‌లెన్సీ అవార్డు. కవితలపోటీలలో రాంభక్తి గంగారాం మెమోరియల్ ట్రస్ట్, ఎక్స్‌రే, ఆంధ్రప్రభ, ద్వానా-నేటినిజం బహుమతులు. వివిధ పత్రికలలో కొన్ని కవితలకు బహుమతులు.

సభలు సమావేశాలు:

పొత్తూరి సుబ్బారావు తరచూ అనేక సభలు, సమావేశాలలో పాల్గొంటుంటారు. ముఖ్యంగా 2013లో అమెరికా డెమాయిన్‌లో నెలకొల్పబడిన 'మనబడి' వారు నిర్వహించిన ఉగాది-శ్రీరామనవమి సాంస్కృతిక ఉత్సవాలలో ముఖ్య అతిథి గా పాల్గొనటం విశేషం. అంతర్జాతీయ సంస్థ తానా వారు అంతర్జాలంలో నిర్వహించిన లఘుప్రక్రియల విశిష్టత అనే కార్యక్రమంలో 'వ్యంజకాలు'పై ప్రసంగించటం జరిగింది. వంగూరి ఫౌండేషన్ వారు అంతర్జాతీయంగా నిర్వహించిన అంతర్జాల సమావేశంలో సాహిత్య పత్రికల సేవపై ప్రసంగించటం జరిగింది. ఇంకా వంశీ ఇంటర్నేషనల్ వారు అంతర్జాతీయంగా అంతర్జాలంలో నిర్వహించిన

'తొలి కిరణాలు' ఆవిష్కరణలో..

సినిమా విశ్లేషణా కార్య క్రమాలు, కవిసమ్మేళనాల లోకూడా పాల్గొనటం జరిగింది.

తెలుగు రాష్ట్రాలలోనేకాక బిలాయిలో జరిగిన చత్తీస్‌గఢ్, తెలుగు మహాసభలలో చిన్నపత్రికలమీద పత్రాన్ని సమర్పించి ప్రసంగించారు.

విజయవంతంగా జరిగిన "అక్షరయాన్ పురస్కారాల" ప్రదానం

సభకు అధ్యక్షత వహించి ప్రసంగిస్తున్న పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వి.సి. ఆచార్య తంగెడ కిషన్‌రావు. వేదికపై దీపికారెడ్డి, ఎస్.కె.జయచంద్ర, సురభి వాణీదేవి, డా॥ మామిడి హరికృష్ణ, హైమావతి భీమన్న.

అమ్మంగి వేంకట శేషలక్ష్మి రచించిన పుస్తకావిష్కరణలో..

సాహిత్యంతో పాటు సామాజిక సేవలో అక్షరయాన్ భాగస్వామ్యం కావడం హర్షించదగిన విషయమని శాసనమండలి సభ్యురాలు సురభివాణీదేవి అన్నారు. అక్షరయాన్ తెలుగు ఉమెన్ రైటర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో శనివారం అక్షరయాన్ పురస్కారాల ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సురభివాణిదేవి మాట్లాడుతూ.. కథలను చదివి స్ఫూర్తి పొందాలని సూచించారు.

నేటితరంలో పుస్తక పఠనం పెరగాల్సిన అవసరం వుందని సభాధ్యక్షులు తెలుగు వర్సిటీ వి.సి. ఆచార్య తంగెడ కిషన్‌రావు అన్నారు. పూలతో అలంకరించబడిన ఈ సూచికగా అనిపిస్తోందని అక్షరయాన్ సంస్థ కృషి ఎంతో ఘనీయమైనదని కొనియాడారు. ఈ సభకు విచ్చేసిన నాకంటే పెద్దవారైన వారందరికీ నమస్కారాలు, మిగతావారికి అభినందనలు, పిల్లలకు నా ఆశీర్వచనాలని సంస్థ ముఖ్యులైన అయినంపూడి శ్రీలక్ష్మి బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

దేశ భవిష్యత్తుకు కృషి చేస్తున్న మన శాస్త్రజ్ఞులు చంద్రయాన్‌ను విజయవంతం చేసినట్టే సమాజ శ్రేయస్సుకు పాటుపడుతున్న ఈ కవయిత్రులు అక్షరయాన్‌తో రచనల్లో తమ తమ ప్రతిభను చాటుతున్నారని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ మామిడి హరికృష్ణ అన్నారు. పదిహేనువందలకు పై మహిళా రచయితలున్న ఏకైక సంస్థ అక్షరయాన్ అని, ఏ అంశం ఇచ్చిన తెరిచి అక్షరాలకు పదును పెడుతున్నారని అక్షరయాన్ చేస్తున్న కృషిని కొనియాడారు.

తెలుగు మహిళా రచయితల సంస్థగా ఏర్పడిన అక్షరయాన్ సంస్థ వయసు నాలుగేళ్లు. నలభై మందితో బొమ్మలు పాల్గొనడం వారిలో ఉ రకలేస్తున్న ఉత్సాహాన్ని చూసి ఒకింత ఆశ్చర్యం, ఆనందం కలుగుతోందని అందుకు సంస్థలోని సభ్యులందరి కృషి ఫలితమేనని అయినంపూడి శ్రీలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత

సభలో ప్రసంగిస్తున్న అయినంపూడి శ్రీలక్ష్మి, డా॥ మామిడి హరికృష్ణ, సురభి వాణిదేవి, ఎస్.కె.జయచంద్ర, బి. సుమతి, డా॥సమ్మెట విజయ

డా॥ ముక్తేవి భారతిగారికి (2022) తరిగొండ వెంగమాంబ పురస్కారం

అన్నంగి వేంకట శేషలక్ష్మిగారికి (2023) తరిగొండ వెంగమాంబ పురస్కారం

డా॥ ఆలూరి విజయలక్ష్మిగారికి (2022) రంగాజమ్మ పురస్కారం

డా॥ వసుందరారెడ్డి గారికి(2023) రంగాజమ్మ పురస్కారం

లక్ష్మీగణేష్, నర్సింహుల పల్లి (2023) అక్షరయాన్ బాలుర పురస్కారం

విరజానంద వైదిక విద్యాలయం వారికి అక్షరయాన్ అందిస్తున్న 5000/- రూ॥ల విరాళం

సభాప్రాంగణం చూస్తూంటే రాబోయే అర్థవంతమైన రచనలు చేస్తు తమ విజయదశమి ఉత్సవంకు ప్రారంబ తమ తలంపులకు హృదయ తలుపులు

2019లో ఏర్పాటైన ఈ సంస్థ నేటికీ అంతర్జాతీయంగా ఉన్న తెలుగు మహిళా సాహిత్యకారులనందరినీ ఒక త్రాటి మీదకు తెచ్చి పదిహేను వందల మంది సభ్యులతో వెబ్సైట్‌ను నిర్వహించే స్థాయికి చేరడం వెనక గురుతర బాధ్యతలను తీసుకున్న వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి, వ్యవస్థాపక సభ్యులు శ్రీమతి డా॥ సమ్మెట విజయ, సుధాశేఖర్, శ్రీమతి యశోద, శ్రీమతి విశ్వైక, శ్రీమతి డా॥. విష్ణువందన, శ్రీమతి లీల ఇంకా అనేక మంది మహిళామూర్తులు ఉన్నారని అన్నారు.

వుమెన్స్ సేఫ్టీవింగ్ డిఐజీ సుమతి మాట్లాడుతూ మహిళల భద్రతకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని మహిళల్లో ఓ ధైర్యం పురుడు పోసుకుందని అన్నారు. బాధిత మహిళల సంఘ టనలు పలు సందర్భాలలో అక్షర యాన్ రచయిత్రులకు వివరించినపుడు ఆ సంఘటనలను కవిత్వంలో, కథల్లో, వ్యాసాల్లో గొప్పగా రచనలు చేశారని అవి పుస్తక రూపంలో కూడా వచ్చా యని అన్నారు. అక్షరయాన్ రచయిత్రులందరికీ అభినంద నలు తెలిపారు.

ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్ ల ప్రభావం విపరీతంగా వుందని అవసరంకంటే అనవసరమైనవే ఆకర్షిస్తున్నాయని ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన విషయమని విశ్రాం త ఐ.పి.ఎస్. మాజీ డి.జి.పి. ఎస్.కె. జయచంద్ర అన్నారు. పుస్తక పఠనమే మనిషి ఎదగడానికి మూలమవ ుతుందని, చదవడం ప్రతి ఒక్కరు విధిగా పాటించాలని, జ్ఞానం పెంచుకో గలిగినప్పుడే పదిమందికి జ్ఞానాన్ని అందించగలమని, అక్షర యాన్ సంస్థ చేస్తున్న కృషిని అభినందిం చారు.

తెలుగు సాహిత్యానికి విలువైన కృషి చేసిన మహిళా సాహితీ మూర్తులు, లబ్ద ప్రతిష్టుల కీర్తి వ్యాప నమే లక్ష్యంగా ఆయా సాహితీ మూర్తుల పేర్ల మీదుగా ఈ రోజు పురస్కార మహోత్స వం ఏర్పాటు చేశామని వ్యవస్థాపక అధ్యక్షురాలు అయినంపూడి శ్రీలక్ష్మి తెలిపారు.

మహిళా రచయితలతో ఓ సంస్థ ఏర్పాటు చేయాలి అందుకు తగిన పేరు సూచించమని అడిగిన వెంటనే "అక్షరయాన్" అని నామకరణం చేసిన డా॥ మామిడి హరికృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. కవి సమ్మేళనంలో అక్షర యాన్‌లోని రచయితలందరు ఎక్కువ సంఖ్యలో పాల్గొనడం ఆనందంగా వుందని అన్నారు. ముఖ్యంగా వయసుతో నిమిత్తం లేకుండా పిల్లలు,

వి. ప్రతిమగారికి (2022)'బండారు అచ్చమాంబ' పురస్కారం

డా॥ తాళ్ళపల్లి యాకమ్మగారికి (2023) 'బండారు అచ్చమాంబ' పురస్కారం

రేణుక ఈదొళ్ళ (2022) తరపున అక్షరయాన్ యువ రచయిత్రి పురస్కారం

రాచూరి శ్రీ చందన్ (2023) అక్షరయాన్ యువ రచయిత్రి పురస్కారం

నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి, హైమావతి భీమన్న తదితరులు పాల్గొన్నారు.

తరిగొండ వెంగమాంబ పురస్కారం

పురస్కార ప్రదాత చిట్ల పార్థసారథి గారి తల్లి ప్రమీల గారి పేరు మీదుగా పురస్కార గ్రహీతలైన డా॥ **ముక్తేవి భారతి** (2022), **అన్నంగి వేంకట శేషలక్ష్మి** (2023) లకు అయినంపూడి శ్యాం సుందర్‌గారు, అయినం పూడి సరోజినిగారు అందజేశారు.

బండారు అచ్చమాంబ పురస్కారం

బైస కళావతి గారి పేరుమీద పురస్కార గ్రహీతలైన **వి. ప్రతిమ** (2022), **డా.తాళ్లపల్లి యాకమ్మ** (2023)లకు పురస్కార ప్రదాత బైస దేవదానం, వీణాదానులు అందజేశారు.

కుప్పాంబిక పురస్కారం

పొన్నం మల్లమ్మ గారి పేరు మీద పురస్కార గ్రహీతలైన **చుక్కాయపల్లి శ్రీదేవి** (2022), **దేవనపల్లి వీణావాణి** (2023)లకు పురస్కార ప్రదాత పొన్నం రవిచంద్ర ప్రదానం చేసారు.

రంగాజమ్మ పురస్కారం

అయినంపూడి సరోజిని పేరు మీదుగా పురస్కార గ్రహీతలైన :**డా॥ఆలూరి విజయలక్ష్మి** (2022), **డా.వసుంధరారెడ్డి** (2023) లకు పురస్కార ప్రదాత అయినంపూడి శ్రీలక్ష్మి ప్రదానం చేసారు.

యువ రచయిత్రి పురస్కారం

మామిడి స్వరాజ్యం గారి పేరుమీద పురస్కార గ్రహీతలైన **రేణుక ఈదొల్ల** (2022), **రాచూరి శ్రీ చందన** (2023)లకు పురస్కార ప్రదాత డా॥మామిడి హరికృష్ణ ప్రదానం చేసారు.

అక్షరయాన్ బాలికా పురస్కారం

బతుకమ్మ ఫౌండేషన్ ద్వారా పురస్కార గ్రహీతలైన **వైష్ణవి తడపాకల్** (2022) (నిజామాబాద్), **అంజనా సాత్విక** (2023) (విశాఖపట్నం)లకు పురస్కార ప్రదాత డా॥ బండారు సుజాత శేఖర్ ప్రదానం చేసారు.

అక్షరయాన్ బాలుర పురస్కారం

శ్రీ ఫౌండేషన్ ద్వారా పురస్కార గ్రహీతలైన **రేవంత్ గౌడ్** (2022) (సిద్ది పేట్), **లక్ష్మీ గణేశ్ నర్సింహుల పల్లి** (2023) (పెద్ద పల్లి జిల్లా)లకు పురస్కార ప్రదాత బండారు జయశ్రీ ప్రదానం చేస్తారు .

అక్షరయాన్ బాలికా పురస్కారం

పురస్కార గ్రహీత **బి. సాయి దీవన** (శ్రీరాంపురం) (2023)కు అక్షరయాన్ సంస్థ ప్రదానం చేసింది.

తెలుగు భాష పై అక్షరయాన్ నిర్వహించిన కవితల పోటీలో

ప్రథమ - **తక్కళ్ల పల్లి స్వాతి** (హనుమకొండ)2001/-

ద్వితీయ- **స్వాతి శ్రీకాంత్ బోడిగాం** (ఆదిలాబాద్)1501/-

తృతీయ -**వాడపల్లి రాధ** (హైదరాబాద్) 1001/- లకు బహుమతులను శ్రీమతి అన్నంగి వేంకట శేష లక్ష్మి ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా **విరజానంద వైదిక విద్యాలయం**కి అక్షరయాన్ విరాళంగా 5000/- రూపాయలను అందించింది.

అక్షరయాన్ నిర్వహించిన ఈ అవార్డుల కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా జరిగింది. కార్యక్రమ నిర్వహణలో అయినంపూడి శ్రీలక్ష్మి గారితో పాటు డా॥సమ్మెట విజయ, విశ్వైక చేయగా యశోద, చంద్రిక, లీలారెడ్డి, కిరణ్, ఆనంద్ విరించి, అనిల్, సుధారాణి, సంధ్య , శైలజ మొదలైన వారెందరో తమ సహకారాన్ని అందించారు.

మొదట అతిథులను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ప్రాంగణంలోకి స్వాగతించాక కొంత సేపు సభా వేదికపై శ్రీ చందన, శివాని, ఫజల్ , మహేష్ పాటల ఆస్వాదన జరిగింది. వేదిక మీదకు అతిథులను ఆహ్వానించాక అక్షరయాన్ వ్యవస్థాపకురాలు శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి స్వాగతం పలికారు.

అమ్మంగి వేంకట శేషలక్ష్మి రచించిన "సదాస్మరణీయులు", "భరత భూమి" పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్షరయాన్ శ్రేయోభిలాషులు డా॥నాళేశ్వరం శంకరం, మామిడి హరిమధుసూధన్, కామేశ్వరరావు, నమస్తే తెలంగాణ, నవ తెలంగాణ ప్రత్యేక ప్రతినిధులను ఘనంగా సత్కరించారు.

చుక్కాయపల్లి శ్రీదేవిగారికి (2022) 'కుప్పాంబిక' పురస్కారం..

దేవనపల్లి వీణావాణిగారికి (2023) 'కుప్పాంబిక' పురస్కారం..

వైష్ణవి, తడపాకల్, నిజామాబాద్ జిల్లా (2022) అక్షరయాన్ బాలికా పురస్కారం

అంజనా సాత్విక, విశాఖపట్నం (2023)అక్షరయాన్ బాలికా పురస్కారం

బి సాయినవీన, భద్రాద్రి కొత్తగూడం (2023) అక్షరయాన్ బాలికా పురస్కారం.

'అక్షరయాన్' బృందంతో అతిథులు.

ఖమ్మం జిల్లాలో విషాదం..కూలీలపై పిడుగుపాటు..

–ఇద్దరి పరిస్థితి విషమం.. మిగతా వారికి గాయాలు

ఖమ్మం సెప్టెంబర్ 26 (ఎక్స్ప్రెస్ న్యూ స్); : ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపల్లి మండలం దమ్మాయిగూడెంలో మంగళవారం వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన ఎనిమిది మంది కూలీలపై పిడుగు పడింది. గ్రామానికి చెందిన మద్ది వీరయ్య మిర్చి, పత్తిచేనులో కూలీలు చెత్తను తొలగిస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది.కూలీలు వెంటనే పనులు ఆపి పక్కనే ఉన్న వేప చెట్టు కిందకు చేరారు. ఇంతలోనే భారీ శబ్దంతో పిడుగు ఒక్కసారిగా పడడంతో ఎనిమిది మంది కూలీలు పిడుగుపాటుకు గురయ్యారు. ఈ ప్రమాదంలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండగా.. మిగతా వారికి గాయాలు అయినట్లు తెలిసింది.

పర్యాటకంతో ప్రగతి పరుగులు..!

ప్రపంచ పర్యాటక రంగానికి ఊతం ఇవ్వడానికి 27 సెప్టెంబర్ 1970న తీసుకున్న తీర్మానం ప్రకారం అంతర్జాతీయ టూరిజం సమాజం 'ఐరాస వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్, యుయన్‌డబ్ల్యూటిఓ'ను ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించడంతో ప్రతి ఏట 27 సెప్టెంబర్‌న ప్రపంచ దేశాలు 'ప్రపంచ పర్యాటక దినం (వరల్డ్ టూరిజం డే)' పాటించుట 1980 నుంచి ఆనవాయితీగా మారింది. పర్యాటకంతో ప్రపంచ దేశాల, ప్రాంతాల ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక, ఉద్యోగ ఉపాధుల విలువలు ప్రభావితం అవుతాయనే అవగాహనను కల్పించేందుకు 'ప్రపంచ పర్యాటక దినం' వేదికలను వినియోగిస్తారు. 1997 నుంచి 'వరల్డ్ టూరిజం డే' వేడుకలను ఒక్కోదేశంలో నిర్వహిస్తూ, టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 మంది ఉద్యోగుల్లో ఒక్కరు పర్యాటకరంగానికి సంబంధించిన ఉద్యోగాల్లోనే ఉన్నారని అంచనా.

ప్రపంచ పర్యాటక దినం - 2023 నినాదం:

సృజనశీల వినూత్న భావనలు, డిజిటల్ విప్లవ ఫలాలతో టూరిజం పరిశ్రమ రూపు రేఖలు ఆసాంతం మారిపోయాయి. కోవిడ్-19 విపత్తుతో అభివృద్ధి చెందిన, చెందుతున్న ప్రపంచ దేశాల సామాజిక, ఆర్థికరంగాలు కుదేలై చితికి పోయాయి. కరోనా విపత్తు వల్ల ప్రపంచ టూరిజం 4 ట్రిలియన్లు నష్టపోయిందని అంచనా వేశారు. పర్యాటక పరిశ్రమలోని మిలియన్ల ఉద్యోగాలను కరోనా మింగేసింది. విపత్తు మబ్బులు పూర్తి తొలగిన వేళ నేడు ప్రపంచ పర్యాటకం కొత్త పుంతలు తొక్కుతున్నది. ఈ ఏడాది ప్రపంచ పర్యాటక దినం-2023 నినాదంగా "పర్యాటకం - పెట్టుబడులు (టూరిజమ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్)" అనే నినాదం తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. 'ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030'లో ప్రముఖమైన పేదరిక నిర్మూలన, ఆకలిని అంతం చేయడం, లింగ సమానత్వం, ఆర్థిక ప్రగతి లాంటివి సాధించడానికి పర్యాటకరంగం కూడా ఎంతగానో దోహదపడుతుందని గమనించాలి.

పర్యాటక పరిశ్రమతో ఆర్థికాభివృద్ధి:

ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగంగా పర్యాటకానికి పేరుంది. గత కొన్ని ఏండ్లుగా ప్రపంచ పర్యాటకం అనేక రేట్లు పెరగడం, ఆధునిక హంగులు తొడగడం చూశాం. 1950లో అంతర్జాతీయ పర్యాటకులు 5 మిలియన్లు (2 బిలియన్ల డాలర్ల రెవెన్యూ) నమోదు కాగా, 2019లో 1.3 బిలియన్ల (1,260 ట్రిలియన్ డాలర్ల రెవెన్యూ) వరకు పెరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. గ్లోబల్ డిజిపీలో పర్యాటక పరిశ్రమ 10 శాతంగా ఉందని అంటున్నారు. ప్రతి ఏట ప్రపంచ పర్యాటకాభివృద్ధి 3 శాతం పెరగాలని లక్ష్యం చేసుకున్నారు. పర్యాటక పరిశ్రమ ఊపులో ఉన్న భారత్‌లో దేశ జిడిపీలో 9.2 శాతంగా ఉంటూ అతి వేగంగా విస్తరిస్తోంది. దేశ పర్యాటక పరిశ్రమలో 43 మిలియన్ల ఉద్యోగులు పని చేస్తూ, ప్రతి ఏట 10 మిలియన్లకు పైగా విదేశీ పర్యాటకులతో దినదినాభివృద్ధి చెందుతోంది. దేశవ్యాప్తంగా ఉత్తర భారతం నుంచి దక్షిణం వరకు వెలసిన విలక్షణ జన జాతులు, విభిన్న సంస్కృతులు, వారసత్వ సంపదలు, ప్రకృతి పరిచిన అందాల విందులు, పుణ్య తీర్థయాత్రలు, అద్భుత కట్టడాల రమణీయతలు, పర్యాటకంతో ప్రపంచ శాంతి, సోదర భావం, సాంస్కృతిక వినిమయం, పరమత సహనం లాంటి ముఖ్య అంశాలు సిద్ధిస్తాయి.

దేశీయ పర్యాటకం:

ఇండియాలోని కేరళ, ఉత్తరాఖండ్, హిమాచల్ లాంటి రాష్ట్రాలు పర్యాటకం మీదనే అధికంగా ఆధారపడి ఉన్నాయి. అంతర్జాతీయ విమానాయాన రంగంతో మొదలు అతి చిన్న గ్రామీణ బడుగు కుటుంబాల వరకు అందరినీ అక్కున చేర్చుకొని పర్యాటకులకు ఆహ్లాదాన్ని, స్థానికులను ఉపాధులను ప్రసాదిస్తున్న పర్యాటక పరిశ్రమ మళ్ళీ తేరుకొని, పుంజుకొని మిలియన్ల కుటుంబాలలో నవ్వుల పువ్వులు పూయించాలని కోరుకుందాం. ప్రతి ఒక్కరం జీవితంలో తరుచుగా పర్యాటక ప్రణాళికలు వేసుకొని, పర్యాటకుడిగా ఆనందానుభూతులు పొందుతూ, పలువురికి ఉద్యోగ ఉపాధుల కల్పనలో పరోక్షంగా దోహదపడదాం. విశ్వ రహస్యాలు, దర్శనీయ స్థలాలు, ప్రకృతి అందాలు తెలుసుకునేందుకు ప్రయాణాలకు సిద్ధం అవుదాం.

(27 సెప్టెంబర్ 'ప్రపంచ పర్యాటక దినం' సందర్భంగా)

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

ప్రముఖ సాహితీవేత్త నిజాం వెంకటేశం స్మారక సాహిత్య పురస్కారం

ప్రముఖ సాహితీ వేత్త కీ. శే. నిజాం వెంకటేశం 14 నవంబర్ న జయంతి సందర్భంగా ప్రతి యేటా కథ,కవిత్వం, సాహిత్య విమర్శ ప్రక్రియలకు రొటేషన్ పద్ధతిలో పదివేల రూపాయలు , అలాగే 40 ఏళ్ల లోపు ఒక యువ సాహితీవేత్త కు రూ.5000 పురస్కారం ఇవ్వనిర్ణయించాం.ఈ యేటి పురస్కారానికి ప్రగతిశీల దృక్పథం గల రచయితల నుంచి సాహిత్య విమర్శకుల నుంచి , యువకవుల నుంచి కవిత్వ సంపుటులు ఆహ్వానిస్తున్నాం. రచనలు 2021- 2023 మూడేళ్లలో ప్రచురించినవి అయి వుండాలి. రచనలు 2 కాపీలు తక్కువ కాకుండా మాకు అందాల్సిన చివరి తేది 20 అక్టోబర్ 2023. నవంబర్ 14 న నిజాం వెంకటేశం గారి జయంతి సభలో పురస్కార ప్రదానం జరుగుతుంది.పంపవలసిన అడ్రస్:బి ఎస్ రాములు 201, సులేఖ గోల్డెన్ టవర్స్,.2-2/186/53/5రామ కృష్ణ నగర్,బాగ్ అంబర్ పేట్ హైదరాబాద్- 500013.ఫోన్ 8331966987.

అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి పురస్కారాన్ని వంశీరామరాజు, డా॥తెన్నేటి సుదకి బహూకరిస్తున్న అక్కినేని నాగసుశీల, తోటకూర ప్రసాద్, మురళీమోహన్, శారద ఆకునూరి.

మహనీయుల జీవితాలు స్ఫూర్తిదాయకం

–ధైర్యం, ఆత్మవిశ్వాసానికి ప్రతీక చాకలి ఐలమ్మ
– అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి, సెప్టెంబర్ 26 (నేటినిజం ప్రతినిధి): ఉద్యమ స్ఫూర్తి ప్రదాత గొప్ప పోరాట యోధురాలు, తెలంగాణ పౌరుషాన్ని, పోరాట స్ఫూర్తిని చాటి చెప్పిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని, ఆమె ఆశయ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వీరనారి చాకలి ఐలమ్మ 128 వ జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమంలో వీరనారి చాకలి ఐలమ్మ ముఖ్య భూమిక పోషించారని, తెలంగాణ పౌరుషాన్ని, పోరాటాన్ని, త్యాగాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని ప్రదాత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఐలమ్మ సమాజంలో నేనే కాదు నాతో పాటు అందరూ బాగుండాలని పెత్తందార్ల అరాచకాలకు ఎదురొడ్డి ధైర్యంగా పోరాటం చేసిందన్నారు. సమాజం గురించి తెలుసుకుని ఎంతో కొంత అందరూ సేవ చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని ఉద్భవించారు.

కార్యక్రమంలో రజక సంఘం ప్రతినిధులు చేసిన పలు ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెల్తానని వారికి చెప్పారు. కార్యక్రమానికి ముందు కలెక్టరేట్ పక్కనగల చాకలి ఐలమ్మ విగ్రహానికి రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, సి డి సి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారి జగదీష్, రజక సంఘం జిల్లా అధ్యక్షులు నామాల నగేష్, బిసి సంఘం రాష్ట్ర కార్యదర్శి బీరయ్య యాదవ్, రిటైర్డ్ ప్రిన్సిపల్ అనంతయ్య, కల్లుగీత కార్మిక ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, కెవిపిఎస్ అధ్యక్షులు మాణిక్యం, డివిఎంసి మెంబర్ దుర్గాప్రసాద్, పోలీస్ రామచందర్, కూన వేణు, హరిహర ప్రసాద్, కొండల్ స్వామి, వై బాలకృష్ణ, శివరాజ్, సతీష్, రాజు, విజయ్, మురళి, దేవదాస్, బాలరాజు, ధర్మేందర్, సంగయ్య, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, మహిళలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కలిగిన అథ్లెటెక్స్ విద్యార్థులకు ఆర్థిక సహాయం

చౌటుప్పల్ సెప్టెంబర్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);చౌటుప్పల్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల నందు చదువుతున్న విద్యార్థులు యాదాద్రి భువనగిరి లో జరిగినటువంటి జిల్లా స్థాయి అథ్లెటెక్స్ గెలుపొందారు. వారు తదుపరి రాష్ట్రస్థాయి అట్టర్ టెక్స్ లో పాల్గొనుటకై కరీంనగర్ కు వెళ్ళుటకు గాను రవాణా ఖర్చులకోసం పాలకూర్ల శివయ్య గౌడ్ ఫౌండేషన్ చైర్మన్ పాలకూర మురళి ఒక్కొక్కరికి 700 రూపాయలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మంగళవారం పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ప్రేరణ కలిగించే పుస్తకాలను అందజేసారూ.. ఈ సందర్భంగా పాలకూర్ల మురళి మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఎలాంటి సహాయం కావాలన్నా చేయడానికి మా ఫౌండేషన్ ద్వారా మేము ముందు ఉంటామని చెప్పారు.. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కే భవాని మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

కవయిత్రి బందారు సునీత కు "కలం స్నేహం" పురస్కారం.

కలం స్నేహం సంగీత సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నాడు జరిగిన రాష్ట్రస్థాయి కవయిత్రుల సమ్మేళనంలో పాలమూరు జిల్లా కవయిత్రి , ఉపాధ్యాయురాలు బందారు సునీత రాష్ట్రస్థాయి "కలం స్నేహం" పురస్కారం అందుకున్నారు. పాలమూరు జిల్లా కేంద్రంలో ఆదివారం నాడు జరిగిన కలం స్నేహం ఆవిర్భావ వేడుకలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ సంగీత దర్శకులు, గీత రచయిత గోపాల్ ఆచార్య మాట్లాడుతూ పాలమూరు కవన వేదిక సమన్వయకర్తగా, సామాజిక కోణాలలో అనేక రచనలు చేస్తున్న బందారు సునీత కు కలం స్నేహం అవార్డు అందజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సునీతను శాలువా మెమెంటో ప్రశంసా పత్రంతో సత్కరించారు. రాష్ట్రస్థాయి కవయిత్రులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో కలం స్నేహం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మేకల అనురాధ , శాంతా రెడ్డి నిర్వాహకులు రావూరి వనజ , చీదేళ్ల సీతాలక్ష్మి, అరుణ కుమారి, రాధా కుసుమ ,సావిత్రి సాహితీవేత్తలు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు ఉపకరణాల పంపిణీ

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 26:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ వయో శ్రీ యోజన పథకంలో భాగంగా మంగళవారం 22 మంది వయోవృద్ధులకు ఎంపీపీ బూర వజ్రవ్వ ఆధ్వర్యంలో వీల్ చైర్లు, హియరింగ్ ఎయిడ్, నడుం పట్టీలు, చేతి కర్రలు, చంక కర్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మేకల రవి, వివిధ గ్రామాలఎంపీటీసీలు, సర్పంచులు సిడిపిఓ ఎల్లయ్య, ఏసిడిపిఓ సుచరిత, సూపర్వైజర్ నిర్మల, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

ఈ నెల 30న టామ్ కామ్ ఆధ్వర్యంలో ఎమ్మెన్నార్ నర్సింగ్ కళాశాలలో నమోదు డ్రైవ్ కం వర్క్ షాప్

సంగారెడ్డి, సెప్టెంబర్ 26 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) రిక్రూట్మెంట్ ఏజెన్సీ విదేశీ ఉద్యోగ నియామకాల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వందన మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. యూఎస్ఏ కెనడా జపాన్ ఆస్ట్రేలియా యూకే జర్మనీ ఇతర యూరోపియన్ దేశాల లో అర్హత కలిగిన నర్సులు మరియు ఇతర ఆరోగ్య సంరక్షణ కార్మికుల డిమాండ్ దృష్ట్యా, సురక్షిత చట్టబద్ధమైన వలస మార్గాల ద్వారా అర్